
# నాలుగు వారాల మనిషి

యం.వి.యస్. హరనాథరావు



సీతారాముడు లాంతరు వెలుగులో ఉత్తరం మరోసారి చదువుకున్నాడు.

తృప్తిగా నిట్టూర్చాడు.

"మాస్టారూ! టైమెంత."

"ఎనిమిది."

తొమ్మిది గంటలకు మెయిల్ వస్తుంది త్వరగా నడవాలి. నడుస్తున్నాడు.

అయ్యర్ హోటల్‌లో టిఫిన్ చేసి బయలుదేరితే?—

జేబులో పావలాకాసు మాత్రం వుంది. ఈ జన్మకు ఆ అవకాశం కూడా లేదు.

"ఎనిమిదింపావు."

వడివడిగా నడుస్తున్నాడు.

"ట్రయిన్ కరెక్టు టైముకే రావాలి" స్టేషన్‌మాస్టరు చెప్పాడు.

ఎనిమిదిన్నర.

పట్టాల వెంట నడుస్తున్నాడు.

మరో అరగంటలో తనకు చావు ఖాయం.

"అబ్బ ఎంత దెబ్బ తగిలిందీ!"

రాయి కొట్టుకున్న కాలినుండి రక్తం కారుతోంది బ్రొటన వేలు చాలా బాధగా వుంది. చావబోయేవాడికి ఈ బాధ లెక్కలోనిది కాదు.

సీత బండి ఎక్కేవుంటుందా! పెద్దదానికి పదమూడో ఎక్కాం వచ్చిందో రాలేదో? చిన్నదానికి విరేచనాలు అని రాసింది. ఎలావుందో. అమ్మ బూడిద శ్మశానంలో వుంది. బాకీకోసం రామిశెట్టి ఎదురుచూస్తుంటాడు కాబోలు. పఠాన్‌ఖాన్ తిరుగుతుంటాడు.

పెద్దగా నవ్వాడు సీతారాముడు.

జీవితంలో మొదటిసారీ— చివరిసారీ వీళ్ళందరి నుండి చావు తనను దూరంగా నడిపిస్తోంది. గెలిపిస్తోంది.

టైం ఎంతయిందో?

వెధవది— ఈ పట్టాల వెంట చిన్న లైట్లన్నా వుంచాలి. చావాలనుకున్న వాళ్లు చీకటిలో ఎలా నడుస్తారు.

పట్టాల వెంట నడుస్తున్న సీతారాముడు, వేసిన గేటును చూసి ఆనందించాడు.

"బండి వచ్చే టైం అయ్యింది కాబోలు."

చకాచకా నడుస్తున్నాడు.

గేటు అవతల తెల్ల అంబాసిడర్ ఆగివుంది. గేటుమీద వేలబడిన మనిషి గేటుమెన్‌ను పిలుస్తున్నాడు.

ఆ వ్యక్తి అప్పారావ్. సీతారాముడి ఆఫీసులో గుమస్తా.

"హల్లో బుద్ధన్!"

సీతారాముడి ఆఫీసు పేరు.

అప్పారావ్ దగ్గర మందు వాసన వస్తోంది.

"ఏం ఇటు బయలుదేరావ్. చచ్చిపోవాలని ప్రయత్నమా. ఇంద సిగరెట్టు."

"వొద్దు."

"వడ్డీలో కలపను లేవోయ్ అవును రేపు ఉదయం వడ్డీఏనా అసలేమయినా ఇస్తావా!"

"నీకెంత ఇవ్వాలి."

"నాలుగొందలు ప్లస్ వడ్డీ"

"రేపు ఆఫీసులో మొత్తం ఇచ్చేస్తాను."

అప్పరావు ఎగిరి గంతేశాడు.

"ఏంటి గురూ బేంకుదోపిడీనా! ఈ శుభసమయంలో నిన్ను పార్టీకి అహ్వానిస్తున్నాము రా గురూ."

"చావబోయే ముందు నాకు అన్యాయంచేస్తారా"

సీతగొంతు సినిమా టెక్నిక్‌లో పలికింది.

"వొద్దుగురూ, పనివుంది."

గేటు తీశారు. కారు కదిలింది.

"అది బ్రాందీవాసన కాదురా! నాలాటివారి రక్తం వాసన. సంవత్సరం నుండి ఎంత వడ్డీ కట్టించావురా! దొంగపీనుగా! రేపు ఉదయం రా! ఇస్తాను."

వెర్రిగా ఆకాశం తాకాలన్నంత ఉత్సాహంలో ఎగిరాడు.

టైం తెలియడంలేదు.

నడిచిన దూరం చాలు.

దూరంగా నక్షత్రాల్లా కనిపిస్తున్నాయి— పట్టణంలోవి లైట్లు.

చివరిసారిగా వ్రాసిన ఉత్తరం జేబులో వుంది. తన ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కారు అని రాశానా లేదా!

మర్చిపోతే ఎలా!

ఆ వాక్యం రాసేముందు కలం కొద్ది క్షణాలు కదల్లేదు.

కారణం— తన చావుకు అందరూ బాధ్యులే కాబట్టి.

సీతారాముడు ఉత్తరం తీశాడు. చీకట్లో అక్షరాలు సరిగ్గా కనబడటం లేదు.

"ఛీ ఎప్పుడూ ఇంతే. ఆఫీసరు దగ్గరకు వెళ్లిన ఫైలులో ఫలానీ విషయం సరిగ్గా రాశావా లేదా అని అనుమానిస్తాను. తిట్లు తింటాను."

ఆ చీకట్లో మళ్లీ రాశాడు.

"నా చావుకు ఎవరూ బాధ్యులు కారు."

పట్టాల మీద నిర్భయంగా కూర్చున్నాడు. తన చావును తలచుకుని ఏడ్చాడు.

చిన్నతనంలో ఈ పట్టాల వైపు మురళీ— రాజాలతో వచ్చేవాడు— ఆడుకోను.

"సీతా! ఆ పట్టాల వైపు వెళ్లకు నాయనా! మొన్న మనకు పాలుపోసే వెంకడి మనవడు రైలు క్రింద పడి చచ్చాడు. నీ కేదయినా జరిగితే నేను బతక లేను నాయనా! ఆ పట్టాల వైపు వెళ్ళనని ఒట్టువెయ్యి"

తల్లిచేతిలో ఒట్టు వేశాడు.

ఒట్టుతీసి గట్టుమీద పెట్టి పట్టాల వైపు ఆడుకోను వచ్చేవాడు.

ఉమ్మిరాసిన అణాకాసును పట్టాలకు అంటించి బండి వెళ్లగానే పెద్ద దయిన అణాకోసం వెదికేవాడు.

సరిగ్గా— ఇదే స్థలంలో...

ఆ రోజులు ఎంత బావుండేవి.

మురళీగాడు ఢిల్లీలో రైలుమంత్రి దగ్గర పనిట. రాజా మాత్రం కలకత్తాలో రైలు ఇంజనీరుట. తను మాత్రం రైలుక్రింద మరణించే వ్యక్తి.

పాతికేళ్ల క్రితం ఈ ముగింపు తెలిస్తే ఎంత బావుండేది.

"పట్టాల వైపుకు వెళ్లకు నాయనా అని ఒట్టు వేయించుకున్న తల్లిని మోసంచేసినందుకు శిక్ష ఇన్నాళ్లకు అనుభవిస్తున్నాను."

టైం ఎంతయింది.

మెయిల్ ఇంకా రాలేదే.

పట్టాలమీద తలపెట్టాడు

నిద్రవస్తే బావుండును. ఆ నిద్రలోనే అలా అలా ... ప్రాణాలు ఎగిరిపోతే ..

చొక్కాజేబులో ఉత్తరం వుంది. తల తెగి రక్తం వెల్లువై చొక్కా తడిసి జేబులోని అక్షరాలు చెరిగిపోతే ఎలా!

సీతారాముడు లేచి కూర్చున్నాడు.

ఉత్తరం పాంటుజేబులోకి మారింది.

* * *

అనగనగా ఒక వూరు.

ఆ వూరికి ఉత్తరాన ఉరదలమర్రి లేదుగానీ సీతారాముడి ఇల్లు వుంది. అదిగో.. అదే సీతారాముడి ఇల్లు.

ఇపుడు సమయం ఉదయం ఐదుగంటలు

## రెండోవారం కథ.

మున్సిపాల్టీ పంపునీళ్లమీద హక్కుకోసం పోరాటం మరికొద్ది క్షణాల్లో ప్రారంభమౌతుంది. దోమలు భుక్తాయాసంతో మరికి కాల్వలకు మళ్లుతున్నాయి.

"ఇలా నీళ్లపాలు పోస్తే మా కొద్దు."

"మీరిచ్చే పైసలకు గుప్పెడు గడ్డి రాదు."

"అందుకని మరీ ఇంత అన్యాయమా! మేమూ డబ్బులు దొంగతనం చేయడంలేదు."

"అమ్మగారూ మాటలనవసరం. ఇష్టమైతే పోయించుకోండి.. లేకపోతే మానేయండి."

"నెలాఖరులో అదే పని చేస్తాను."

దుప్పట్లో నిద్ర నటిస్తున్న సీతారాముడు ఆ చివరిమాట విని కదలకుండా పడుకున్నాడు.

పాతబాకీ అంటున్నాడు వెధవ. విసిరి పారేస్తాను. బాకీ వున్నంత మాత్రాన నీళ్లపాలు పోయాలా!

"పోస్తానండీ ఏంచేస్తారు." పాలవాడి గొంతు.

"ఏమిటా కేకలు. ఆయన నిద్రలేస్తే బావుండదు."

నిద్రలేచినా ఏం ప్రయోజనం. వెధవ బాకీ పురుషత్వాన్ని చంపేసింది. ఐనా ఏ పాలు పోస్తేనేం. వాడు మాత్రం బ్రతకొద్దూ. గేదెను మేపాలంటే మాటలా!

సీతకు ఏమీ తెలియదు. కాపురానికి వచ్చింది మొదలు ఇలా పాలవాడిని కేకలువేస్తున్న సీతగొంతు వినవలసిందే గాని— ప్రేమగా "ఏమండీ" అని తనను పలుకరించిన రోజు లేదు.

పాలవాడు వెళ్లిపోయాడు.

ఒక అధ్యాయం ముగిసింది.

"ఇదేం నీ బాబుగాడి పంపనుకున్నావా!"

"ఏం! మీ బావగారిదా!"

"ఏవమ్మోయ్. మాటలు తిన్నగా రానీ."

"ఏం చేస్తావ్."

"అంటాను. ఏంచేస్తావ్."

"ముందు అను."

"మీ తగాదా తర్వాత. ముందు నన్నో బిందె పట్టుకోనివ్వండి." సీతగొంతు.

ఆక్కడివారెవరూ వినే స్థితిలో లేరు. పంపుకిందవున్న బిందె లాగి తన బిందె పెట్టింది సీత.

"ఏమిటమ్మా! నీ పొగరు."

"మర్యాదగా మాట్లాడు."

"నా పసాని పనిచేసి మాట్లాడతావా! ముందు బిందె తియ్యి."

"నేను తీయను. ఇది నా వంతు."

"కలెక్టరు పెళ్లాంలా ఏమిటా తల తిరుగుడు."

"పంపుదగ్గర ఏమిటి నీ అధికారం." కఠినంగా వుంది సీతగొంతు.

సీతారాముడు నిద్ర నటించడం మానలేదు.

కొంపదీసి నన్ను ముగ్గులోకి పిలవరు గదా! ఆ అధికారం చెలాయిస్తున్న గొంతుగల ఆడమనిషి కానిస్టేబులుగారి భార్య. ఆవిడగారితో సీతకు ఎందుకు వాదన. సీతకు మరీ భయంలేకుండా పోయింది. మంచితనంతో బట్టతలమీద వెంట్రుకలనైనా మొలిపించవచ్చు. ఆ మాత్రం సీతకు తెలియదు. ఎప్పుడు తెలుసుకుంటుంది. పంపుదగ్గర తన భార్యకు జరిగిన అవమానం మనసులో పెట్టుకుని ఆ కానిస్టేబులు ఏ హత్యకేసులోనైనా తనను ఇరికిస్తే ఇంకేమన్నా వుందా!

ఈ పంపుల దగ్గర మనుషులలోనే సరైన అవగాహన లేకపోతే ఈ దేశంలో సోషలిజం ఎలా వస్తుంది. ఎప్పుడు వస్తుంది.



"ఏమండి, మిమ్మల్నే అబ్బబ్బ పాడునిద్ర" సీత గాజుల చేతులు.

నటిస్తున్న నిద్రను చంపక తప్పలేదు. కళ్లు నులుముతూ లేచాడు. రెండోవది పక్కలో వెధవపని చేసింది కాబోలు— లుంగి చల్లగా వుంది.

"మీకేం మగమహారాజులు. బారెడు ఎండ వచ్చేదాకా ముసుగుదన్ని పడివుంటారు. ఆ పాలవాడు ఏం కూశాడో తెలుసా."

"పాలవాడు అప్పుడే వచ్చాడా."

నిద్ర లేవగానే మొదటి అబద్ధం.

జరిగిందంతా అక్షరం తప్పకుండా చెప్పి విశ్రాంతికూడా లేకుండా పంపు భాగోతం చెప్పి—

"ఇక పళ్లు రుద్దండి."

"ఇంత జరుగుతుంటే నన్ను నిద్రలేపకూడదూ?"

నిద్ర లేపితే ఏంచేసేవారేం అన్నట్లు చూసింది సీత. ఏంచేసేవాడ్ని కాదన్నట్లు వాకిట్లోకి నడిచాడు సీతారాముడు.

"ఏం అమ్మా రాత్రి బాగా నిద్రపట్టిందా."

రాత్రి అంతా తల్లి మూలుగు వింటూనే వున్నాడు.

అమ్మ ఇంకా మూల్గుతూనే వుంది.

"రాత్రి మందు వేసుకున్నావా "

తలూపింది తల్లి.

తుక్కుమంచంలో చావు ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న ముసలి పెళ్లికూతుర్లా వుంది తల్లి.

మనసారా తల్లిని చూడలేదు. తల్లిని తెలిపే మోసంచేస్తున్నాడు. ఏం చేయాలో అర్థంకాక చేస్తున్నాడు.

తానొక మాతృద్రోహి.

"ఓ నెలలో తగ్గుందన్నాడు డాక్టరు. మళ్లీ ఈరోజు మందు అడిగి తెస్తాను."

లోపలకు కదిలాడు సీతారాముడు.

"నాన్నా నా నోషలు పుస్తకం తెచ్చావా?"

"తెచా నమ్మా."

"ఏదీ?"

"ఆఫీసులో పెట్టి మరచిపోయాను. సాయంత్రం పట్టుకొస్తాను."

రెండో అబద్ధం అన్నట్లుగా కుంపటి దగ్గర సీత నవ్వింది.

సీత ఆ నవ్వులో ఎంత బావుంది.

దొడ్లోకి నడిచాడు. కాలకృత్యాలు పూర్తయ్యాయి.

సీతారాముడు సీతను చూచాడు. అలసిపోయిన కళ్లు.. ఇక ఈ బ్రతుకింతే అన్నట్లు కనబడే ఫీలింగు

"ఏమిటా చూపు?"

గతంలో తనలా చూస్తే ఎంత సిగ్గుపడేది. చేతుల కందకుండా ఎలా పరుగుతీసేది. ఆ ప్రేమ, అభిమానం సీతలో ఏమైపోయాయి. ఆ చురుకుతనాన్ని చిలిపితనాన్ని సీత ఏంచేసింది.

బుల్లిది గోలచేస్తోంది. రెండోది దగ్గుతోంది. పెద్దది పళ్లపొడి పార పోస్తోంది.

నా సీత అందాన్ని నాశనంచేసిన పిల్లలు వీరంతా. సీత ప్రేమను దక్కకుండా దూరంచేసిన రాక్షసులు వీరంతా.

కాఫీగ్లాసు నేలమీద పెట్టి విసురుగా వెళ్లిపోయింది సీత.

ఆ గ్లాసు ఆ గ్లాసుమీది అక్షరాలు సీతారాముడిలో విటమిన్ మాత్రల్లా రోజూ పనిచేస్తాయి. ఆ గ్లాసుమీద ఎంతో ప్రేమ. ప్రేమగా గ్లాసు అందుకున్నాడు.

"సీతారాముడు—సీతల వివాహ శుభసందర్భంలో మిత్రుడి కానుక."

ఆ అక్షరాలు చదువుకున్నపుడు గతంలోకి వెళ్లడం సీతారాముడి అలవాటు.

ఆ ఆలోచనలో . మొదటి నెల జీతం పారేసుకుని మళ్లీ దొరికించు కున్నంత ఆనందం ఫీలవుతాడు.

*    *    *    *

అనగనగనగా వున్న సీతారాముడు చేస్తున్నది గుమాస్తా పని.

పెళ్లిచేసుకుంది సీతను.

సీత నాయన మూడువేలు కట్నం ఇస్తానన్నాడు. మరో రూపాయి ఎక్కువడిగితే గుండెపగిలి చచ్చేవిధంగా వున్నాడు. అందుకే జాలిపడి ఒక రూపాయి తక్కువకే సీతను పెళ్లిచేసుకున్నాడు.

ఆడవాళ్లు కనేందుకు మెటర్నిటీ లీవులుంటాయి. కానీ బ్రహ్మచారి గుమాస్తాలకు పెళ్లయితే హనీమూన్ లీవులుండవు.

గర్భాధానానికి సెలవెందుకూ— ఆఫీసు పగలు కదా! ముహూర్తానికి మాత్రం లేటు పర్మిషను ఇస్తాను అనే దుర్మార్గపు మానవుడు సీతారాముడి— ఆఫీసరు.

ఆ ఆఫీసరును అందుకే ముద్దుగా 'మారీచుడు' అని పిలుస్తాడు.

సీత ఆ ఇంట్లో అడుగుపెట్టింది.

అది ఇల్లు కాదు. గది.. గది అనబడే ఇల్లు.

"రెండు గదులున్న ఇల్లు దొరికినా బావుండును" సీతారాముడి తల్లి పంచలో మంచం వాలుస్తూ అన్నది.

గదిలో చాప అనే పట్టెమంచం మీదవున్న సీతారాముడు– సీత అందాలను లెక్కవేస్తూ తల్లి మాటలు విని లెక్కతప్పాడు.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు."

"ఏంలేదు."

"పాపం! మీ అమ్మ బైట చలిలో "

ఆ మాటకు సీతారాముడు సిగ్గుపడ్డాడు తను అనవలసిన మాట సీత అన్నందుకు చాపతోపహా కొన్ని వందల గజాలు భూమిలోకి వెళ్ళిపోయాడు.

పెళ్ళయిన పదిరోజులకు భార్యను వదిలి ఏ భర్త వుండగలడు. వున్నది ఒక్క గది. ఆ గదిలో పొగలు చిమ్మే కాఫీల్లాంటి దంపతులు సమయం అర్ధరాత్రి.... మల్లెపూల మత్తు .

అమ్మ చలికి మూలుగుతోంది.

తల్లిని మొదటిసారి తిట్టుకున్నాడు.

భార్యను చూచాడు. వియోగం క్షణాలైనా యుగాలైనా అనుభవం ఒక్కటే.

"సీతా!"

సీతను కౌగలించుకున్నాడు.

తన దగ్గు విని కొడుకు బాధపడతాడని, ఆ దంపతుల సుఖానికి అడ్డు రాకూడదని, వస్తున్న దగ్గును బలవంతంగా చేతులతో ఆపిన తల్లిని గురించి సీతారాముడుకి తెలియదు. కాదు సీతారాముడు ఉద్రేకానికి తెలియదు.

ఉదయం.

"రాత్రి బాగా మంచు కురిసినట్లుంది కదమ్మా!" దొంగ అన్నాడు.

"ఏమో నాయనా. నాకు నిద్రపట్టింది. తెలియనే తెలియదు."

"కాదు. అబద్ధం అంతా అబద్ధం. నీ కొడుకు సుఖానికి అడ్డు రాకుండా! రాత్రంతా ఈ మంచంలో దగ్గుతూ మూలుగుతూ ఈ వయసులో రోగాన్ని కొనితెచ్చుకుంటున్నావు నేను పాపిని. నా సుఖంకోసం, ఆనందం కోసం రాత్రంతా నిన్ను మంచులో వుంచాను నేను మాతృద్రోహిని.

సీతారాముడు ఇలా మాట్లాడాలనుకున్నాడు. మాట్లాడలేకపోయాడు.

సీత కాఫీ ఇచ్చింది.

గ్లాసుమీద అక్షరాలు నవ్వాయి వెక్కిరిస్తూ.

"సీతారాముడు — సీతతొ వివాహశుభసమయంలో".

గదిలో ఒకవైపు అమ్మ మంచం వాల్చబోయాడు.

"ఎందుకు బాయనా! పంచలో బాగానే వుంది."

సీతారాముడు వినలేదు.

ఆ గదిలో ఒకవైపు వంట, మరోవైపు పడకగది.

సీత కూర వేయిస్తోంది.

రాత్రి చూసిన సీతకు, ఇప్పుడు చూస్తున్న సీతకు ఎంత తేడా! తలలో మల్లెలు తురుముకుంటున్న ఆ వేళ్లలో కనిపించిన అందం, మరో క్రొత్త అందంగా గరిటె తిప్పుతున్నప్పుడు ఆ వేళ్ళలో కనిపిస్తోంది. ముఖానికి పట్టిన చిరుచెమట, ఎగిరే ముంగురులు, నిద్రలేని రాత్రిని గుర్తుచేసే బరువైన ఆ కళ్లు — ఎంత బావున్నాయి.

సీతను కౌగలించుకోవాలి. ముద్దు అందుకోవాలి. పగటి ముద్దు దొంగ ముద్దు. అలా దొంగతనంగా పెట్టుకునే ముద్దు చాలా ముద్దుగా వుంటుందన్నాడు వో అనుభవజ్ఞుడు.

"సీతా."

సీత చూచింది.

తల్లి తలెత్తి చూచింది.

"పొయ్యి సెగ తగ్గిందేమో చూడు."

ఇంకేం మాట్లాడలేక దొడ్లోకి నడిచాడు.

సీత నవ్వుతుంది.

తల్లి అర్థంచేసుకుంది.

పళ్లుతోమడం మరచిపోయి స్నానంచేశాడు సీతారాముడు.

* * *

''మారీచులవారు పిలుస్తున్నారు'' సుగ్రీవుడొచ్చి చెప్పాడు.

ఆఫీసరుగారు పిలుస్తున్నారని బంట్రోతు భీమయ్య వచ్చి చెప్పినప్పుడల్లా —సీతారాముడు అలా వూహించుకుంటాడు.

శూర్పణఖ నవ్వింది టైపు మెషీన్‌ముందు కూర్చుని.

'వెళ్ళిరా' కళ్ళజోడు సర్దుకుంటూ అన్నాడు సుబాహు. హెడ్ క్లర్కుని 'సుబాహు' అని పిల్చుకుంటాడు మనసులో.

"నమస్కారం సార్."

"టైమెంత?"

సీతారాముడు మాట్లాడలేదు. గడియారాన్ని చూచాడు.

అరగంట లేటు.

"గడియారాన్ని కాదు. నా ముఖం చూచి చెప్పు."

"సారీ సార్."

"ఆఫీసు పడకగది కాదు. ఎప్పుడంటే అప్పుడు రాను."

పాత సినిమా రచయిత రాసిన కొత్త సినిమా డైలాగులా వుంది అనుకున్నాడు సీతారాముడు.

"నిన్న నేను సంతకం చేసిన ఫైల్లో స్పెల్లింగు దిద్దింది నీవేనా."

తలూపాడు తెగిపడే విధంగా.

"గంగిరెద్దులా తలూపడం కాదు."

"ఎవర్రా నీకు గంగిరెద్దు. మాటలు తిన్నగా రానీ."

"మిస్టర్ సీతారాముడూ—"

"చివర 'సార్' అని తగిలించు. నీ సొమ్ముకాదురా నాకు జీతం ఇస్తోంది. నీలా రికమండేషన్ బాపతుకాదురా నేను. కష్టపడి చదివి.... పరీక్షలుపాసై, ఆపీసులచుట్టూ తిరిగి ఉద్యోగం సంపాదించానురా! పెళ్లానికి భయపడే వెధవ్వి కాబట్టి పెందలాడే ఆపీసుకు వస్తావు, ఆలస్యంగా కొంపకు చస్తావు."

"మిస్టర్! నిన్ను సస్పెండు చేస్తున్నాను."

"ఏడిశావ్. ఆపని చేస్తే నిన్ను మర్డర్ చేస్తాను."

సీతారాముడుకు చెమటలు పట్టాయి.

ఇన్ని మాటలు నిజంగా తను అన్నాడా!

అంతా వూహ. పిరికివాడి వూహ.


"క్షమించండి సార్."

మారీచుడు ముందు సీతారాముడు అనగలిగిన మాట అదొక్కటే.

"నో నో... నీ పీరోజు సెలవు పెట్టు."

సీతారాముడు బైటకొచ్చాడు.

"ఏమైంది" శూర్పణఖ అడిగింది.




"సెలవు కావాలన్నాను. వెంటనే ఇచ్చాడు."

అందరూ అబద్ధం అని అరిచినట్లు నోర్లు తెరిచారు.

• • •

రిక్షాలో సీతారాముడు, సీత సినిమాకు బయలుదేరారు.

మూగమనసులు సినిమా రెండురోజుల క్రితమే కొత్తగా వచ్చింది.

సమయం నాలుగయింది. కావాలని పెందలాడే బయలుదేరారు.

సినిమాహాలు ఎదురు పార్కులో కూర్చున్నారు.

"అనవసరంగా ఆఫీసుకు సెలవు పెట్టారు."

"నీ కోసం."

"రెండు గదులున్న ఇల్లు చూస్తే బావుంటుంది."

"ఎందుకు?"

సీత నవ్వింది.

సీతారాముడు సిగ్గుపడ్డాడు.

ఇప్పుడున్న గదికి డెబ్భయ్ రూపాయలు అద్దె. రెండు గదుల ఇల్లు కావాలంటే నూటపాతిక దాకా పెట్టక తప్పదు. జీతంలో సగం అద్దెకు పోతే మిగిలిన ఖర్చులు ఏంచేయాలి.

సీతారాముడు తండ్రి దమ్మిడీ ఆస్తి ఇవ్వలేదు.

ప్లీడరు గుమాస్తా సుందరరామయ్య సంపాదన ఏం చేసేవాడో ఎలిమెంటరీ స్కూల్లో చదివే సీతారాముడికి తెలియదు. హైస్కూల్లో చదివేనాటికి సుందర రామయ్య అనబడే తండ్రికి కాంతం అనే అమ్మితో సంబంధం వుందని తెలుసుకున్నాడు.

తల్లి ఎప్పుడూ దిగులుగా వుండేది. బిడ్డను పక్కలో పెట్టుకుని ఎన్నో రాత్రులు నిద్రపోకుండా ఏడుస్తూ గడిపేది. ఆమె కన్నీళ్లను చూస్తూ అన్ని రాత్రులు మేల్కొనే వుండేవాడు. తను ఇంటికి రావడం ఆలస్యం అయితే భయపడేది.

సీతారాముడు తల్లి పెంపకంలో పెరిగాడు.

ఆమెలోని అమాయకత్వం, అసహాయత, దుఃఖం తనూ పంచుకున్నాడు.

మానెడు బియ్యంకోసం తల్లి చెవిదిద్దులు తాకట్టుపెట్టడం తెలుసు. స్కూలు ఫీజు కోసం తల్లి ఎదురింట్లో వంటచేయడం సీతారాముడు మరచిపోలేదు.

ఎప్పుడయినా బజారులో తండ్రి కనబడేవాడు. పిల్చి ఓ రూపాయి మిఠాయి కొనిపెట్టేవాడు. ఆ రోజు తల్లి చేతుల్లో తన్నులు తినేవాడు. తను కొట్టిన దెబ్బలను తడుముతూ తల్లి ఏడ్చేది.

ప్రపంచం అంతా దుఃఖమయంగా కనబడేది.

ఊహకు తెలియని బాధ ప్రతి మనిషిలోనూ కనబడేది.

ఒకరోజు ఎవరో వచ్చిచెప్పారు... తండ్రి చనిపోయాడని. తల్లితో పాటు తండ్రిని చూడను బయలుదేరాడు. తండ్రి శవం చూచి ఏడవలేదు. తల్లి ఏడుపు చూచి ఉండలేకపోయాడు. ఏడ్చాడు.

రిక్షాలో శవాన్ని తెచ్చారు.

జీవితంలో భర్త ప్రేమను పూర్తిగా పొందలేని ఆ ఇల్లాలు తన భర్త కోసం అంతగా ఏడవడం చూచి ఆశ్చర్యపడ్డాడు.

దాన్ని ప్రేమ అంటారని ఊహ వచ్చింతర్వాత తెలుసుకున్నాడు.

తల్లి తనకోసం అష్టకష్టాలు పడింది.

తల్లి పడిన కష్టాలు చూచిన సీతారాముడు మనసుకు బ్రతుకంటే ఎంత భయమో తెలిపింది. ఆ భయం వయసుతోపాటు పెరిగింది పెద్దదయింది.

* * *

సీతారాముడు కళ్లలో నీళ్లు చూసిన సీత అంది.

"ఏమిటండీ ఆ కన్నీళ్లు "

"నలక పడింది."

"అబద్ధం  నేను మీ కళ్ల పడ్డాను. నేను నలకనేగా."

"కాదు  నా_ . "

ఏం చెప్పాలో అర్థంకాలేదు.

సినిమా వదిలారు.

"ఇంత ఖరీదయిన టిక్కెట్టు కొనడం ఇదే మొదటిసారి" అనుకున్నాడు. తన జీవితానికి కూడా ఖరీదు పెరిగినంత గర్వంగా మెట్లెక్కుతున్నాడు. సీట్లు పక్కపక్కనే దొరికాయి.

ఆ దూరంగా కూర్చున్నవాడి భార్య, సీత అంత అందంగా లేదు. ఆ రెండో వరుసలో అమ్మాయి భర్త కాబోలు మల్లెపూల పొట్లం భార్యచేతి| ఇస్తున్నాడు.

అరే! సీతకు పూలు కొనలేదు. ఏమనుకుంటుందో.

సీట్లు విండాయి

"మంచి సినిమానేనా" సీత అడిగింది

"బాగానే వుందన్నారు "

"రేలంగి వున్నాడా?"

"నేను నీ పక్కనే వున్నానుగా  హాస్యానికి."

సీతారాముడు నవ్వబోయాడు.

గేటుదగ్గర మారీచుడు నిలబడి సీటుకోసం చూస్తున్నాడు. మొదటి వరస వెదుకుతున్నాడు.

ఈ వెధవ ఈ సినిమాకే రావాలా! మరో సినిమాకు చావకూడదూ. ఈ క్లాసులో చూస్తే ఇంకేమన్నా వుందా! నే నేదో లంచాలు మరిగాననుకుంటే.

"ఏమిటండీ మీ చేతులు వేడిగా వున్నాయి."

ఇటు చూస్తే  అమ్మో చూస్తాడు  వాడి కళ్లు తుమ్మముళ్లు.

"ఏం సీతారాముడూ సినిమాలు ఎక్కువయ్యాయ్!"

"లేదుసార్."

"ఆఫీసు వర్కు పెండింగులో వుంచి దిగులుపడి నేను చస్తుంటే పెళ్లాంతో సినిమాకు ఏడుస్తావా!"

"క్షమించండి సార్."

"నీ వెంత నీ జీతమెంత- రెండున్నర రూపాయి టికెట్ పెట్టి సినిమాలను పోషిస్తున్నావా ! పైగా వాకిట్లో సీటులేకుండా నిలబడ్డ నన్ను చూచి కనీసం విష్ చేయకుండా పెళ్లాంతో సరదాలు వెలగబెడతావా."

సీత కంగారుపడుతోంది.

"ఏమిటండీ వణుకుతున్నారు."

"ఆఁ ఏంలేదు చేతిగుడ్డవుందా."

తీసి ఇచ్చింది కర్చిఫ్ అందుకున్నాడు. ముఖాన వేసుకుని కూర్చుంటే వాడు కనుక్కోలేడు. ఇదేమిటని సీత అడిగితే—

"ఏమిటండీ ముఖాన అలా కప్పుకున్నారు."

"చెమట తుడుస్తున్నాను సీతా ఆ గేటుదగ్గర ఎవరైనా వున్నారా."

"ఆఁ వున్నారు ఏం."

"వాడు వెళ్లింతర్వాత చెప్పు"

"ఎందుకంత భయం"

"నీకు తెలియదు. దయచేసి నా మాట విను"

సీతకు అర్థంకాలేదు

బెల్ కొట్టారు. తెరమీద బొమ్మలు కదులుతున్నాయి.

"సినిమా కూడా అలానే చూస్తారా."

"లైట్లు తీసేశారా"

"ఊఁ"

"ఆ గేటుదగ్గరవాడూ.."

"అంటే ఆ టికెట్లు చింపేవాడేగా."

"కాదు మారీచుడు. అంటే మా ఆఫీసరు . కాదు.... ఆ బట్టతల వెధవ."


"మీరు కర్చీఫ్ కప్పుకున్నప్పటినుండీ ఆ టికెట్లు చింపేవాడే వున్నాడు. ఆఫీసరంటే మీకు భయమా."

కర్చీఫ్ తీశాడు. లైట్లు లేవు. చీకటిగా వుంది.

"భయం కాదు. నాకేం భయం. వాడు నన్నో వంద అప్పు అడిగాడు. తప్పించుకు తిరుగుతున్నాను. సినిమా చూడు."

మూగమనసులు టైటిల్‌కార్డు వచ్చింది.

* * *




అమ్మ తలుపు తీసింది.

"బావుందా నాయనా సినిమా."

"బావుందమ్మా."

నిజానికి సీతారాముడికి సినిమా బాగులేదు. అందులోనూ దుఃఖమే. ఈ దుఃఖం భయం ఎందుకు వెంటాడుతున్నాయో అర్థంకాదు.

ఆ గదిని రెండు భాగాలుచేస్తూ కట్టిన దుప్పటిని చూచాడు సీతారాముడు. తల్లి ఆ పని చేసింది. ఎందుకు చేశావమ్మా అని సీతారాముడు అడగలేదు.

చాప వేసింది సీత. నడుం వాల్చాడు. సీతారాముడికి దూరంగా పడుకుంది సీత.

"సీతా" రహస్యంగా.

ఏమిటన్నట్లు సీత చూపు.

"ఇలారా" సీతారాముడి సైగ.

"రాను" అన్నట్లు సీత తలతిప్పింది. అమ్మ ఇంకా నిద్రపోలేదని యాక్షన్‌చేసి చూపింది.

అమ్మ నిద్రపోయిందని తనూ నటించి చూపాడు.

సీత దగ్గరకొచ్చింది.

అంతా మూగమనసులే. ప్రపంచం అంతా మూగమనసులే.

"ఏం జరిగింది నాయనా" తల్లి కంగారుగా అడిగింది.

సీతారాముడి కాళ్ళు తగిలి బిందె దొర్లింది, గదంతా నీళ్ళమయం.

ఆ రోజు రాత్రి నిద్రలేదు.

సీతారాముడు జీవితంలో అనుభవానికి రానిరోజులు, ఆనందాన్ని దూరంచేసిన రోజులు చాలా ఉన్నాయి. కానీ ఆ గదిలో సంతానలక్ష్మి కొలువు తీర్చింది. రెండేళ్ళకు పెద్దపిల్ల పుట్టింది. మనుమరాలిని చూచుకుని తల్లి సంతోషించింది. తండ్రయినందుకు సీతారాముడు గర్వించాడు. సీత పొంగిపోయింది.

ఏ అందమైనా మొదటి అనుభవానికే పరిమితం.

* * *

సీతారాముడు జీవితం సిమ్మెంటు రోడ్డుమీద నుండి తారు రోడ్డుమీదకు పడింది.

"అబ్బ ఎండ మండిపోతోంది."

కాళ్ళకు చెప్పుల్లేవు. ఎక్కేను సైకిల్‌లో గాలి లేదు.

చెట్టుక్రింద నిలబడ్డాడు.

ఎదురుగా మూగమనసులు సినిమా పోస్టరు వుంది.

"ఇది మూడోసారి అనుకుంటాను రావడం."

మూడో పిల్లకు పాలడబ్బా సైకిలుకు తగిలించిన సంచీలో వుంది.

జీవితంలో అప్పుడే ఎంత మార్పు. ఆ గది ఎంత పని చేసింది. తనకు ముగ్గురు పిల్లలు

గది అద్దె నూటపాతికకు పెరిగింది. తను ఖాళీచేస్తే నూటయాభై ఇస్తారని ఇంటి ఓనరు అంటాడు. అయ్యరు హోటల్లో సాంబారుఇడ్లీ తిని ఎన్నాళ్ళయింది. జేబు చూసుకున్నాడు. పాలడబ్బాకుపోను అరవై పైసలు మిగిలింది.

'దిగ్విజయమైన రెండోవారం' మూగమనసులు పోస్టరుమీది అక్షరాలు.

విలువైన తన జీవితంలో ఇది దిగ్విజయమైన రెండోవారం కాదు. వచ్చిన జీతం పూర్తిగా చచ్చే సంతాప వారం.

అరొందల జీతంలో కత్తెర్లు పోను నాలుగువందల అరవై చేతికొస్తాయి.

"పూలెందుకు తెచ్చారండి. రేపు వుదయం కూర కొనుక్కోవచ్చుగా."

సీతలో ఎంత మార్పు వచ్చింది.

నిన్న వుదయమే చెప్పింది డాక్టరు దగ్గరకు వెళ్ళాలని.

"ఎందుకు."

"నా ఖర్మ" తల బాదుకుంది

"మళ్ళీనా."

కాలుతున్న కాఫీగ్లాసు చేతిలోవుంచి వెళ్ళిపోయింది.

"సీతారాముడు– సీతల వివాహ సమయంలో "

"గ్లాసుమీద అక్షరాలు కనిపించాయి. చెయ్యి చురుక్కుమంది."

జీవితం పెరుగుతోంది. జీతం పెరగడంలేదు.

అద్దెపోను మూడొందల చిల్లర మిగులుతుంది. దాన్ని ఖర్చుపెట్టను తను
ంగులుతాడు. అదీ ఖర్చయిన తర్వాత తన చుట్టూ అవసరాలు, ఇబ్బందులూ
ంగులుతాయి. అప్పుడేంచేయాలి. అప్పుచేయాలి. చేశాడు.

ఆఫీసులో అందరికీ భోజనం కారియర్లు తెచ్చే మనిషి వున్నాడు. వాడ్ని
బేరరావు అని పిలుస్తాడు సీతారాముడు.

"డబ్బు కావాలోయ్."

"మీకాః నే నివ్వడమే. చాల్లెండి సార్ "

"కాదు. అవసరం."

"ఎంత."

"మూడొందలు. పిల్లవానికి పాలడబ్బాలు కొనాలి. అమ్మకు వంట్లో బావు
కు."

"అయ్యో పాపం "

"డాక్టరుకు చూపించాలి."

"డబ్బుకు చాలా కష్టంగా వుంది "

"ఎలాగైనా సరే."

"నూటికి పది వడ్డీ "

"అమ్మో అంతే."

"మీకు కాబట్టి "

"సరే."

"ప్రతినెలా వడ్డీ ఇవ్వండి. వీలు చూచుకుని అసలివ్వండి. సాయంత్రం కనిపించండి "

ఆ సాయంత్రం కుబేరరావు ఇంటిముందు కూర్చున్నాడు. కుబేరరావు వచ్చాడు

"ఇదేమిటి రెండొందల డెబ్భయి ఇచ్చావ్ "

"మొదటి నెల వడ్డీ తీసుకున్నాడు మా బామ్మర్ది. నా దగ్గర లేకపోతే మీకోసం వాడి కాళ్ళమీద పడి తెచ్చాను."

ఆ తర్వాత కుబేరరావు వడ్డీ మాత్రం జమ చేసుకుంటున్నాడు.

"పాపం అసలు అడగలేదు ఇంతవరకు. ఎంత మంచివాడు." అనుకున్నాడు సీతారాముడు.

అప్పు తీసుకున్న రాత్రి సీత అడగనే అడిగింది.

"నెల రెండోవారంలో ఇంత డబ్బెక్కడిది."

"ఎవరో లంచం ఇచ్చారు."

"మీకు కూడా లంచం ఇచ్చే అమాయకు లున్నారా!"

సీతారాముడు చెప్పక తప్పలేదు.

"అప్పు తెచ్చాను. వడ్డీ లేదు అన్నల్లేదు. మన దగ్గర వున్నపుడు ఇవ్వమన్నాడు. నిజంగా. నమ్ము."

"కడుపులోని బిడ్డమీద ప్రమాణంచేసి చెప్పండి."

అక్కడ వుండలేకపోయాడు భోజనం కూడా చేయకుండా బైటకు వడిచాడు. తల్లి పిలుపు కూడా వినలేదు.

జేబులో రెండువందల డెబ్భయి రూపాయిలున్నాయి. మనసు నిండా ఆందోళన వుంది పెళ్ళి చేసుకోకుండా వుంచే తనకు బాధలు వుండేవి కావు. ఎంత జీతం మిగిలేది. పొరపాటు జరిగింది.

సీతను పెళ్ళాడి వో ఆడకూతురికి అన్యాయం చేశాడు తెలియకుండా తనకు తాను అన్యాయం చేసుకున్నాడు.

వీధులవెంట నడుస్తున్నాడు.

బ్రాందీ తాగితే ఎలా వుంటుందీ

"ఏయ్ మిస్టర్ మందుగానీ తాగావా."

అప్పారావు తూలుతూ మీదపడ్డాడు.

"శివా "

"ఆఁ నేనే" భయపడుతూ అన్నాడు సీతారాముడు.

"రా మందుకొడదాం"

చెయ్యిపట్టుక లాగాడు. బార్‌లోకి అడుగుపెట్టాడు.

బార్ తూలుతున్నది.

ఆ రెండో కుర్చీలో మాంసం నములుతున్న పెద్దమనిషి, తన పక్క ఆఫీసులో గుమాస్తా. వాడికి రెండో వరుసలో మందెక్కివై ఇంగ్లీషులో మాట్లాడుతున్నాయన మరో ఆఫీసులో జవాను.

వీళ్లకు సంసారాలు లేవా!

"వున్నాయి." బార్ ప్రతిధ్వనించింది

"మరి జీతాలు ఎలా సరిపోతున్నాయి తాగను తినను తిరగను.

బార్ అంతా వెకిలినవ్వు నవ్వింది

సీతారాముడికి అర్థంకాలేదు.

జీవితంలో దొరకని ఆనందాన్ని ఎదురుగా అరవున్న సీసాలో చూసుకుని, ఆనందం స్వంతమైనట్లు ఆ నిషాలో ఎంత తృప్తిని అనుభవిస్తున్నారు.

"తాగు భాయ్" సోడా కొట్టాడు.

సీత కన్నీళ్లతో కనిపించింది

తల్లి గొంతు నులుముకుంటున్నది.

"నాకు వద్దు అప్పారావ్."

"తాగకపోతే నే చచ్చిపోతాను."

గ్లాసు అందించాడు. అందుకున్నాడు. చేతులు వణకుతున్నాయి

"బిల్లు నీవే ఇద్దువుగాని భయపడకు. కొట్టేయ్"

గ్లాసు వెంటనే ఆ బిల్ మీద వుంచాడు సీతారాముడు.

"ఎంత పిరికివాడివి బ్రదర్. మందు తాగే దమ్ములేనివాడివి జీవితంలో ఏం పైకివస్తావ్. బ్రతకడం సుఖం కోసమే నాకు మందుకు నెలకు వెయ్యి రూపాయిలు అవుతుంది. బాధపడ్డావా. అంతే."

వెయ్యిరూపాయలా! ఆ డబ్బుతో ఎన్ని బియ్యం బస్తాలు, ఎన్ని కేజీల కందిపప్పు, ఎన్ని పాలడబ్బాలొస్తాయి.

"వెధవ వెయ్యి. ఎంతసేపు. కాంట్రాక్టర్‌ను కొడితే రాలతాయి. మన ఆఫీసులో నా సంతకం విలువ తెలుసా! నీవూ వున్నావ్ ఎందుకు. నీవో

వెర్రితుంకవు కాబట్టే అడిస్తున్నారు. నీ సీటు పవరు లేనిది. పైవలు రానిది. నీ నోట్లో మెదడులేదు– తలలో నాలుకలేదు."

వెధవ తాగి మాట్లాడుతున్నాడు. నాలుక లేకపోవడం ఏమిటి, మెదడు లేకపోవడం ఏమిటి.

"నిజం గురూ.. నీ నిజాయితీ ఎవడిక్కావాలోయ్. వోడి నిజాయితీ. నీ చిరుగు గుడ్డలు చూస్తారు. తుప్పుపట్టిన నీ సైకిలు చూస్తారు. వెధవ అలవాట్లు లేని నీ మంచితనం చూస్తారు. హాహా అంటారు. ఎవరిక్కావాలి గురూ ఈ పెహబాస్‌లు. నేనూ నీ లాగే గుమాస్తావి. నాకు స్కూటరుంది. డన్‌లప్ బెడ్ వుంది. బార్‌లో ఖాతా వుంది "

ఇంక వినలేక కోపంగా బైటకు నడిచాడు సీతారాముడు.

ఎదురురాయి తగిలింది. తూలి పడబోయాడు. ఎవరో పట్టుకున్నారు.

ఎదురుగా . ఆఫీసరు కాదు మారీచుడు.

బార్ టోర్డునూ, సీతారాముడి ముఖాన్ని మార్చి మార్చి చూస్తున్నాడు మారీచుడు.

"నేను తాగలేదు మహాప్రభో." అని అరచి కాళ్ల మీద పడదామనుకునే లోగా ఆఫీసరు కదిలాడు.

ఏమనుకున్నాడో. తాగా ననుకున్నాడా!

ఏం తాగకూడదా. నా జీతం. నా ఇష్టం.

అలా అంటే అసహ్యించుకోడూ.

అప్పారావు తాగుతుంటే ఏంచేశాడు. నాకు పీడేం కాదు జీతం ఇచ్చేది– ప్రభుత్వం. నా మీద వీడికేం అధికారం.

రేపు ఈ రోజు జరిగిన విషయం దృష్టిలో పెట్టుకుని, పైలు ఏదన్నా తప్పు వ్రాయగానే


"పీకు ఆఫీసెందుకు. బార్‌లోనే వుండరాదు. రాత్రంతా తాగి ఆఫీసు పనేం చేస్తావ్."

"నేను తాగలేదు సార్."

"నేను చూశాను."

"తమరు నా నోరు వాసన చూస్తే తెలిసేది."

"నాన్సెన్స్. నేను ఆఫీసరును, నన్ను నోరు వాసన చూడమంటావా! క్రమశిక్షణాచర్య క్రింద వారం రోజులు సస్పెండు చేస్తున్నాను."




"సార్ ...సార్ ....సార్ "

సీత తలుపు తీసింది.

"ఎవరినండీ పిలుస్తున్నారు. సార్ ఎవరు."

"నీ వింకా మేల్కొనే వున్నావా?"

మారీచుడు మీది ఆలోచనలతో సార్ ....సార్ అని పిలుస్తూ తలుపులు బాదిన విషయం అర్థంచేసుకున్నాడు.

"అన్నం తిందురు రండి."

"నీవు ఇప్పటిదాకా తిన్లేదా."

అన్నం కలుపుకుంటున్న సీతకళ్ళలోకి చూశాడు. సీత కళ్లలో నీళ్ళు న్నాయి.

"మీకోసం ఎదురుచూస్తున్నాను."

పిల్లలను ప్రక్కకు జరిపి సీత ప్రక్కన చేరిన సీతారాముడు అన్నాడు.
"అమ్మను డాక్టరుకు చూపించాలని అప్పుచేశాను. వడ్డీకి తెచ్చాను."
సీతారాముడు జాత్తులో సీత వేళ్ళు కదిలాయి. ఆ ప్రేమలో ఎంత తృప్తి వుంది.
"మరి సార్ . సార్ అవి ఎందుకు కేకవేశారు."
ఆ మాటకు సీత పక్కనుండి లేచాడు

* * *

"ఎందుకు నాయనా నెల మధ్యలో నాదో ఖర్చు." ఆసుపత్రి ముందు రిక్షా దిగుతూ తల్లి అంది.
తల్లి రెక్కపట్టుకుని నెమ్మదిగా హాస్పిటల్లోకి తెచ్చాడు. పరీక్ష ఫీజు పాతిక రూపాయిలయింది. డాక్టరుగారు పరీక్ష చేశారు. డాక్టరుగారు వందరూపాయిల నోట్లకట్టలా వున్నారు.
"మీ అమ్మగారేనా?"
"అవునండి."
డాక్టర్ ముఖం రంగు మారింది.
"మనం చేయవలసింది చేశాం. మిగిలింది ఆ భగవంతుడే చూడాలి" అని అలవాటుపడిన సినిమా డాక్టర్లా అంటాడేమోనని భయపడ్డాడు.
"కేసు కాస్త కాంప్లికేటెడ్‌గా వుంది. నాకేదో అనుమానంగా వుంది. ముందీ మందులు వాడి, నెలరోజుల తర్వాత మళ్ళీ తీసుకురండి."
మందులు వ్రాశాడు.
ఆ లిస్టు అమ్మకు వాడను రాశాడో లేక కొత్తగా మెడికల్‌షాపు పెట్టుకోమన్నాడో అర్థంకాలేదు సీతారాముడికి.
కానీ ఆ మందులు చూస్తుంటే అమ్మను గురించిన భయం ఎక్కువయింది.
మర్నాడు — ఆఫీసులో అడుగుపెడ్తున్న సీతారాముడి ఎడమ కన్ను అదిరింది తూలి పడబోయాడు.
తూర్పుణాఖ పట్టుకుంది పడకుండా.
రిజిస్టర్‌లో సంతకం చేసి సీట్లో కూలబడ్డాడు.
"గాత్రి అప్పారావ్ కనిపించాడా." సుబ్బారావు అడిగాడు.
"లేదు." అబద్ధం చెప్పాడు సీతారాముడు."

"అబద్ధం. అప్పారావు, మీరు రాత్రి బార్‌కు వెళ్ళారటగా. మా వారు చెప్పారు." శూర్పణఖ అంది.

కొంపదీసి ఈ విషయం పేపరు కెక్కలేదు గదా! కంగారెత్తిపోయాడు. అప్పుచ్చిన కుబేరరావు ఎదురుగా కనిపించాడు.

"ఏరా తల్లి మందులకని వడ్డీకి అప్పుచేసి నీవు మందు తాగావా" అన్నట్లుంది వాడి ముఖం.

"నీ సీటుకా డబ్బులు రావు. అన్ని కత్తెరలు పోను వచ్చే జీతమా గొర్రెతోకంత! సంసారమా గంపెడు, వెధవ తాగుడు నీ కెందుకయ్యా" సుబాహు హితబోధ.

"మీ ఆఫీసులో సీతారాముడు తాగంగా నేను తాగితే తప్పా అన్నారు మా వారు." శూర్పణఖ.

తనను వెధవకింద జమకట్టాడన్నమాట.

"నేను తాగలేదు బాబోయ్" అని అరవాలనిపించింది. తను చేయని పనికి భయం ఎందుకు. తాగానంటే చంపుతారా! తలతీసి మొలేస్తారా!

ఇంకా ఆఫీసరు రాలేదు

ఆయనగారి మాటలు ఎన్ని వినాలో. సెలవుపెట్టి పారిపోతే బావుండును.

ఫోను మ్రోగింది. సుబాహు అందుకున్నాడు.

"అయ్యగారు ఈ రోజు సెలవు పెట్టారు. రాలేరట" ఫోను దించుతూ అన్నాడు సుబాహు.

"ఎందుకనిట" శూర్పణఖ.

"రాత్రి మందు ఎక్కువై పడ్డారట! కాలు విరిగిందట."

సీతారాముడు చెమటలు తుడుచుకున్నాడు. పెళ్ళినాటి ఆనందం అతనిలో కనబడింది.

* * *

అనగనగా వున్నదో సైకిలు. దాని యజమాని సీతారాముడు. అతనికి ఎన్ని సమస్యలున్నాయో ఆ సైకిలులోనూ అన్ని సమస్యలున్నాయి. ఆఫీసుకు ఇంటికి దూరం. ఆఫీసులో చేరిన కొత్తలో కొన్న సైకిలు. ఆ సైకిలును ఎప్పుడో తొక్కినట్లు సీతారాముడికి గుర్తు.

ప్రతి నెలా జీతం అందగానే అనుకుంటాడు.

"ఈ నెలలో సైకిలు బాగుచేయించాలి."

''రెండొందలయితే గానీ మీ సైకిలు బాగుకాదు'' షాపువాడు.

''పోనీ ప్రస్తుతానికి నడిచే మార్గం చూడు.''

''పెడ్లూ, ట్యూబులు మార్చండి.''

''ఎంతవుతాయి.''

''యాభై రూపాయిలవుతాయి.''

ప్రతినెలా మొదటి తారీకున సీతారాముడుకి షాపువాడికి ఇదే సంభాషణ— రెండు మూడు సంవత్సరాలుగా నడుస్తోంది.

''వచ్చే నెలలో రేట్లు తగ్గవచ్చు.'' మనసులో అనుకుని ''మళ్లీ వస్తా'' అని కదులుతాడు సీతారాముడు.

పోయిన నెల మరీ ఇబ్బందయింది.

''సైకిలు అమ్మేయరాదు. నీవేం తొక్కుతున్నావా.''

నిజమే. సైకిలు వున్నా నడుస్తున్నాడు. వెధవ పంచర్లకు సగం జీతం ఖర్చు అయ్యేటట్లుంది. మరో నెల ఆలశ్యంచేస్తే తూకానికి కూడా కొనరు.

''ఎంతకిస్తావు.''

చాలా అవసరంగా వుంది. సీత చీరెలు అసహ్యంగా వున్నాయి. తన చొక్కాలు కుట్టను సీత మరీ ఇబ్బందిపడుతోంది. ఆ చిరిగిన బట్టలతో ఆఫీసులో కూర్చుంటే వెర్రిబట్టలా కనిపిస్తానట. ఆ శూర్పణఖ కూసింది. ఏది ఏమైనా సైకిలు అమ్మిపారేయాలి. సగం దరిద్రం తనకు ఇదే.

''ఏం గురూ ఎంతకిస్తావ్.''

''మీరే చెప్పండి.''

''ఎనభై అయితే తీసుకుంటాను.''


ఎనభయ్యా! ఏమిటి వీడి వుద్దేశ్యం. ఇదేం సైకిలు అనుకున్నాడు పోషణ లేక అలావుంది గాని. ఆయిల్ వేసి తుడిస్తే నాలుగొందలకు తక్కువ అడగరు. కనీసం మూడొందలంటే బావుండేది. సీతకు రెండు చీరెలు, తనకు రెండు జతల బట్టలు వచ్చేవి. అమాయకుడ్ని చేసి చౌకలో సైకిలు కాజేయాలని చూస్తున్నాడు.

''మరో పది ఇస్తాను. తొంభై.''

''మూడొందలకు దమ్మిడీ తగ్గదు.''

అతగాడు అసహ్యంగా నవ్వాడు.

''మూడొందలేం. వెయ్యికి తక్కువ అమ్మకు'' వెళ్లారు.




సీతారాముడికి వొళ్లు మండింది.

ఎందుకు వీళ్లంతా తననూ, తన జీవితాన్ని, చివరకు తన వస్తువులను ఇంత చౌకగా లెక్కవేస్తారు.

ఆ దారంట వెళ్తుంటే ఆ సైకిలుషాపులో తగిలించిన కొత్త టైర్లూ, ట్యూబులు కనిపిస్తాయి.

“ఎందుకు చూపులు. కొంటారా! పెడతారా!”

షాపువాడికి హేళనగా వుంది.

“వచ్చే నెలలో సైకిలు తప్పక బాగుచేయించాలి.”

* * *

ఆ నెలలో పదిహేనవ తేది.

సీత నొప్పులు పడుతోంది. మెలికలు తిరుగుతోంది. మంత్రసాని మంగమ్మ వచ్చింది. రెండు ఇంజక్షన్లు తెమ్మంది.

సీతారాముడు బయలుదేరాడు.

సీతకు మరీ బాధ్యత లేకుండా పోతోంది. ఇంత వయసొచ్చినా ఆలోచనా శక్తి లేదు. నెల మధ్యలో ఎందుకిలా ప్రసవించాలి. నెల మొదటి తేదీలలో ప్రసవిస్తే ఎంత బావుండును. కన్న ముగ్గురు పిల్లలను ఇలాగే నెల మధ్యలోనే కన్నది.

"రెండు ఇంజక్షన్లు ఇరవై రూపాయిలు."

మెడికల్ షాపువాడు చెప్పాడు.

"అప్పిస్తే వచ్చే నెలలో తీరుస్తాను."

"మీరెవరో మాకు తెలియదు."

"నేను ఫలానచోట గుమాస్తాను. కత్తెరలు పోను నాలుగొందల అరవై సంపాదించే మనిషిని."

"గుమాస్తాలకు అసలివ్వం."

"ఎందుకని."

"తీసుకునేదే గాని ఇచ్చేది వుండదు. అప్పు తీసుకున్న తర్వాత కనబడే గుమాస్తాను చూపిస్తే ఈ షాపు మీ కిస్తాను."

"పోనీ సరదాగా నన్ను నమ్మకూడదూ."

ఎవరో చొక్కా పట్టుక లాగారు. పెదవ చొక్కా చిరిగి వూరుకుంది. ఎదురుగా మెడికల్ షాపు లేదు. అప్పారావు వున్నాడు.

ఏమిటి బుద్ధుడా ఆలోచన. చొక్కా చిరిగిందని బాధపడితే ఆ పెళ్తున్న కారుక్రింద పడి చాల్తే నే గల్లంతయ్యేది.

అప్పారావుకు ముందు విషయం చెప్పి ఏడవాలనిపించింది. విషయం చెప్పాడు. ఏడవలేదు.

"అదా సంగతి. చెప్పవేం పద." అంటూ ఎక్కడికో తీసుక వెళ్లాడు.

"వీరే పఠాన్ ఖాన్."

ఆరు అడుగుల ఎత్తు, ఆరు కేజీల మీసాలుగల మనిషిని చూశాడు సీతారాముడు.

"ఎంత కావాలి."

పఠాన్‌ను చూస్తుంటే సీతారాముడుకి నోట మాటరాలేదు.

"రెండొందలు చాలా."

చాలన్నట్లు తలూపాడు.

ఖాన్ డబ్బు తీసి ఇచ్చాడు.

"ఇదిగో నూట అరవై. నూటికి ఇరవై వంతున రెండునూర్లకు వడ్డీ తీసాను– మిగిలిన డబ్బు."

నూటికి ఇరవై రూపాయిలా!

"మన అవసరం గురూ. నీవే కాదు మనలాంటి నెలజీతగాళ్లు చాలా మంది తీసుకుంటారు ఒకటో తేదీ ఐనా నాల్గురోజులు ఆలశ్యంగా వస్తుందేమో గాని ఖాన్ మాత్రం ఆఫీసుకు కరెక్టుగా వస్తాడు. వడ్డీ ఇవ్వకపోయావా! మని షిని చూచావుగా చపాతీలా చుట్టేస్తాడు అంతే. పాపం చాలా మంచివాడు." దారిలో అన్నాడు అప్పారావ్.

పఠాన్ విగ్రహం నిద్రలోకూడ కనిపించే విధంగా వుంది

"ఆ వంద ఇలా ఇవ్వు."

"ఎందుకు?"

"ఎందుకేమిటీ బుద్ధన్. నా దగ్గర యాభై తీసుకున్నావు. గుర్తుందా?"

"మర్చిపోలేదు తర్వాత ఇస్తాను."

అప్పారావు వినిపించుకోలేదు. చొక్కా జేబులో వంద లాక్కున్నాడు.

"తర్వాత లెక్క చెప్తాను." వెళ్ళిపోయాడు.

తన జేబుమీద వీడి స్వాతంత్ర్యం ఏమిటి. వీడు తనమీద జాలిపడి వడ్డీకి ఇప్పించాడా! వాడి అవసరం కోసం ఇప్పించాడా.

"ఛీ వెధవ బ్రతుకు."

"చెల్లాయి పుట్టింది నాన్నా! బుజ్జి చెల్లాయి."

పెద్దది ఎదురొచ్చి చెప్పింది.

"అంతా నీ పోలికే నాయనా. తల్లి అంది"

"కాదు నా దరిద్రం పోలిక." అనుకున్నాడు సీతారాముడు.

## మూడో వారం కథ.

అనగనగా వున్న సీతారాముడు కథ మూడో వారం నడుస్తోంది. ఇది జీతం వచ్చిన పదిహేను రోజుల తర్వాత జరిగిన కథ. అతని జీవితంలో ఆ రోజులు ఎప్పుడు ఎలా గడిచాయో చెప్పలేదు. కారణం అన్ని నెలలు ఒకే రకంగా వుండటమే. రెండో వారంలో మిగుల్చుతున్న విషాదాన్ని మానవత్వపు తృకృతంతో పరిశీలించిన విజ్ఞాని వేషంలో వున్నాడు సీతారాముడు.

గెడ్డం పెరిగింది. బట్టలు మురికిగా ఉన్నాయి.

"నీకు ఎన్నిసార్లు చెప్పాను. ఇలా పాలుపోస్తే మాకొద్దు."
"మానెయ్యండి."
"మానేస్తాం."
"నా డబ్బులివ్వండి."
"నెలాఖరులో కనిపించు."
"అదేం కుదరదు. నాకిప్పుడే కావాలి."
"నెలజీతం మీద బతికేవాళ్లం. ఇప్పుడు డబ్బులు ఎలా వస్తాయి."
"అలా బతికేవాళ్ళకు ఏ పాలు పోస్తేనేం."
"మర్యాదగా మాట్లాడు." సీత గొంతు
దుప్పట్లో సీతారాముడికి సుప్రభాతం వినిపిస్తోంది. తను లేవకపోతే సీత పాలవాడిని హత్యచేస్తుంది.
దుప్పటి తొలగించాడు. పాలవాడ్ని చూచి వేదాంతిలా చిరునవ్వు నవ్వాడు.
"పాపం! అతను మాత్రం ఏంచేస్తాడు— నీళ్ళ పాలు పోయక. మనం ఇచ్చే డబ్బులు అతగాడికి ఏం సరిపోతాయి. గడ్డి ధర, తవుడు, గేదెల ధరలు ఎలా వున్నాయి. అతని ఇల్లు ఈ పాలమీదనే గడవాల.
సీత వొళ్ళు కుంపటిలా వుంది.
సీతారాముడు మాటలకు పాలవాడు కరిగిపోయాడు.
"మీరు చెప్పింది నిజం బాబయ్యా! అందుకే వచ్చే నెల నుండి లీటరుకు ముప్పయి పైసలు పెంచాలనుకున్నాం."
పాలవాడు వెళ్ళిపోయాడు.
"ఇంత అమాయకుడివి. ఎలా బతుకుతావురా" తల్లి గొణిగింది.
కాఫీగ్లాసు ఇంకా రాలేదు.
సీత దగ్గరకు వెళ్లాడు. పొయ్యితో అవస్థపడుతోంది సీత.
'కాఫీ' అన్నాడు.
సీత వీపుమీద రెండోది వుంది. మూడోది నాయనమ్మ దగ్గర మాటలు నేర్చుకుంటోంది. చిన్నది గుక్కపెట్టి ఏడుస్తోంది.
"నాన్నా! నా బొమ్మలు పుస్తకం ఎప్పుడు తెస్తావు."
"తెస్తానమ్మా."
అర్నెళ్ళనుండి అదే మాట. అయినా ఇవేం చదువులు. రెండో క్లాసుకే బొమ్మలా! ఆడపిల్లలకు చదువులెందుకు. చదివి ఏం చేయాలి."

"కాఫీ."

సీత మాట్లాడలేదు. కళ్ళవెంట నీళ్లున్నాయి.

"సీతా."

తలెత్తి చూచింది.

"సీతా! నన్ను క్షమించు. సంసారం ఇలా ఉంటుందని ఊహిస్తే పెళ్ళి చేసుకునేవాడ్నికాదు. నిన్ను సుఖపెట్టలేకపోతున్నాను. సంసారంతో జీతం పెరగడంలేదు మన పెళ్ళపుడు బియ్యం ధరకు ఇప్పటి ధరకు ఎంత తేడావో నీకు తెలుసా? మనకింకా పెరిగే కష్టాలేగాని వచ్చే సుఖాలు లేవు నలుగురు ఆడపిల్లలను కన్నావు. వాళ్ళ పెళ్ళిళ్ళ గురించి ఆలోచించావా? బాంక్‌లో బాలెన్సులు లేవు. అమ్మి చేయను ఆస్తుల్లేవు. పండగొస్తే అప్పు, రోగాలొస్తే అప్పు, ఆఖరికి చావులొచ్చినా అప్పు. రెండు దరిద్రాలకు జరిగిన పెళ్లికి సాక్ష్యాలు మన పిల్లలు. మన దరిద్రానికి వారసులు. మనకు చావంటే భయం. బ్రతుకంటే దిగులు భవిష్యత్తుమీద ఆశ. ఈ దాగుడుమూతల ఆటలో అలసిపోవి అటగాళ్లం."

ప్రతి నెలా మూడోవారంలో ప్రతి ఉదయం సీత ముఖం చూసి అలా అనుకుంటాడు.

ఆదో తృప్తి. ఆనందం.

సీత కాఫీగ్లాసు నేలమీద పెట్టింది.

"సీతారాముడు-సీత వివాహ సందర్భంలో " అక్షరాలు అర్థంలేకుండా నవ్వుతున్నాయి.

"ఈ మాయదారి రోగం తీసుకువెళ్ళినా బావుండును." తల్లి అంది.

శవంలా వుంది అమ్మ.

"అమ్మా ఈ మందు వేసుకో."

"నా కొద్దు నాయనా! సగం జీతం నా మందులకే సరిపోతే పిల్లలేం తింటారు. ఈ కడుపునొప్పితో చచ్చిపోతున్నాను. నా కోసం ఎన్ని తిప్పలుపడి మందులు తెస్తున్నావురా! ఎన్ని అప్పులు చేస్తున్నావురా."

సీతారాముడు ఏం మాట్లాడలేదు.

సైకిలు తీసుకుని ఆఫీసుకు బయలుదేరాడు.

అమ్మ ఇక ఎంతోకాలం బతకదేమో! ఎందుకు బతుకుతుంది. బతికే

విధంగా చేస్తున్నాడా తను. ఏ తల్లికి ఏ బిడ్డ చేయని దుర్మార్గం చేస్తున్నాడు. తను చేస్తున్న పని హత్యకన్నా భయంకరమైంది.

రెండు నెలల క్రితం

ఆ రోజు హాస్పిటల్‌లో అమ్మను పరీక్షచేసిన రెండు నెలల తర్వాత అమ్మకు కడుపులో నొప్పి మరీ ఎక్కువైంది. డాక్టరును చూడక తప్పలేదు.

"మీ అమ్మగారిని పరీక్షచేశాం. ఆమెకు కేన్సరు."

ఉలిక్కిపడ్డాడు సీతారాముడు.

"మేం మందులిచ్చే స్థితి దాటిపోయింది. మద్రాసు గానీ హైద్రాబాద్‌గాని తీసుకవెళ్ళు. నయం కావచ్చు."

హాస్పిటల్‌నుండి బైటపడ్డాడు.

అమ్మకు కేన్సరా! ఇపుడు తనేం చేయాలి. అమ్మకు నయం కావాలి. ఆమె బ్రతకాలి. తనకోసం శ్రమించిన మనిషి. తన బ్రతుకుకోసం బ్రతికిన మనిషి. అమ్మను తప్పక బ్రతికించుకోవాలి. సలహా ఎవరిస్తారు. సీతను అడిగితే —భయపడుతుంది. అమ్మకు చెబుతుంది. కేన్సరని భయపడి దిగులుపడుతుంది అమ్మ.

"కేన్సరా! ఎవరికి?"

అప్పారావు అడిగాడు.

"ఎవరికైతేనేం. హైద్రాబాద్‌లో బాగా చూస్తారా! మద్రాసులోనా!"

"డబ్బుంటే బొంబాయిలో మంచిది.

"అంత దూరం కాదు దగ్గరి విషయం చెప్పు."

"పదివేలు కావాలి."

"ఎందుకు."

"కేన్సరు నయంకాను."


"పదివేలా!"

"అది చాలదు. కేన్సరు ఖరీదయిన జబ్బు."

పోనీలే. జబ్బయినా ఖరీదయింది వచ్చింది అనుకున్నాడు.

"పదివేలెందుకు. నీవేదో అబద్ధం చెబుతున్నావు."

"కేన్సరుతో తమాషానా! పరాన్‌కు కట్టే వడ్డీకంటే భయంకరమైంది. రెండు జబ్బులకు ఒకటే మందు డబ్బు."



సీతారాముడు చాలా మందిని అడిగాడు— అప్పారావు మాటలమీద నమ్మకంలేక.

"కేన్సరు తగ్గను ఎంతవుతుంది."

"ఐదువేలు—పదివేలు చాలదు కనీసం పదిహేను

వంద రూపాయలు పైన మూడొందలు లోపు ఖర్చవుతుందని ఎవరైనా అంటారేమోనని పిచ్చెక్కినట్లు రెండు రోజులు తిరిగాడు

ఆ రెండు రోజులూ నిద్రలేదు.

కళ్లలో పదివేలు కనిపిస్తున్నాయి. ఎవరిస్తారు అంత డబ్బు. పోనీ ఆఫీసులో పి.యఫ్. అవీ ఇవీ అన్ని లోన్లు తీసుకుంటే—

"ముందు తీసుకున్న లోన్లు కట్టవయ్యా."

పఠాన్, కుబేరరావులను అడిగితే ఇస్తారా? కానీ నెలకు ఎంత వడ్డీ కావాలి తన జీతం జీవితాంతం ఇచ్చినా వడ్డీకి కూడా చాలదు.

పదివేలు సంపాదించడం ఎలా?

అమ్మ కేన్సరు ఎలా నయం కావాలి.

అమ్మ బాధను చూడలేని స్థితి.

అమ్మను చూస్తూ అసమర్థుడిలా, ఏమీ చేతకాని చవటలా కూర్చోవాల్సిందే.

మమకారం— ప్రేమ అనుక్షణం వేధిస్తున్నాయి.

ఓ మందులషాపులో అడిగాడు.

"కడుపు నొప్పికి ఖరీదయిన మందు వుందా?"

షాపువాడిచ్చాడు.

"అమ్మా ఈ మాత్ర వేసుకో. డాక్టరు ఏమీలేదని చెప్పి ఈ మాత్రలు రాసి ఇచ్చాడు."

మాత్ర ఇస్తున్నప్పుడు తల్లిని చూడలేకపోయాడు.

అమ్మ తనను నమ్మి ఆ మాత్రలు రెండు నెలలుగా వేసుకుంటోంది. శవంలా తయారవుతోంది.

* * *

ఆఫీసులో అడుగుపెట్టాడు.

"ఏం గురూ గడ్డం పెంచావ్" అప్పారావు

"ఈ రోజు బుద్ధుడుగారు చాలా విచారంగా వున్నారు."

"శూర్పణఖ రాలేదని దిగులేమో. సుబాహు."

"ఎక్కడకు వెళ్ళింది."

"మద్రాసు."

"ఎందుకు సినిమాల్లో చేరడా."

"కాదు. వాళ్ళనాయనమ్మను కేన్సరు ఇన్‌స్టిట్యూట్‌లో చేర్చను."

"కేన్సరా" వెర్రిగా అరిచాడు సీతారాముడు.

"దానికేమండీ.. మద్రాసు తీసుకువెళ్తుంది. నయంకాకపోతే అమెరికా తీసుకపోతుంది. నాలుగు చేతుల సంపాదన.

సీతారాముడు తన చేతులు చూసుకున్నాడు. రెండే వున్నాయి. మరి నాలుగు చేతుల సంపాదన ఏమిటి.

వీళ్ళకు పిచ్చెక్కి మాట్లాడుకుంటున్నారా!

"వారం క్రితం ఎవరితోనో స్కూటర్ మీద కనిపించింది."

నాలుగు చేతుల కథ సీతారాముడుకి అర్థమయింది. ఆఫీసు పని చేయబుద్ధి కాలేదు. ఈ ప్రపంచం నుండి ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తోంది.

సుగ్రీవు డొచ్చాడు.

మారీచుడు పిలుస్తున్నాడని చెప్పాడు.

సీతారాముడు మారీచుడు గదిలోకి వెళ్లాడు

"ఏమిటయ్యా ఈ ఫైలు ఇలా తగలెట్టావ్"

ఎలా తగలెట్టాడో చూడబోయాడు.

"కేపిటల్ అన్న చోటల్లా కేన్సర్, కేన్సర్ అని వ్రాశావు. మేటర్ అని రాయాల్సిన చోటల్లా మనీ- మనీ. అని రాశావు. ఏమిటి నీ వుద్దేశ్యం."

సీతారాముడు మౌనం.

"ఆ గడ్డం ఏమిటి. ఆ బట్టలు చూసుకున్నావా! తలకు నూనె రాసి ఎన్నాళ్లయింది ఆఫీసులో పద్ధతిగా వుండాలని తెలియదా."

"క్షమించండి సార్."

"ఆరోగ్యం బాగలేదా."

పాపం. మారీచుడని పేరు పెట్టాను. ఎంత మంచివాడు పెరిగిన గడ్డం గురించి ఆలోచించాడంటే ఎంత గొప్ప మనసున్నవాడు

"సార్ గతంలో మిమ్మల్ని ఎన్నోసార్లు తిట్టాను. రాత్రి తొమ్మిదయినా కొంపకు పోనివ్వని రాక్షసుడని, పెళ్లాం పిల్లలకు భయపడే చవటని, అందుకే ఆఫీసుకు తొందరగా వస్తాడు- ఆలశ్యంగా వస్తాడని అనుకున్నాను. ఆలశ్యంగా వచ్చినందుకు మెమోలు ఇచ్చారు. క్రమశిక్షణ వుండాలి సార్. మీరు నాకు గొప్పగా నచ్చారు."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్." మారీచుడు కేక.

"క్షమించండి సార్."

"నేను కాదు ఇంట్లో నీ పెళ్లాం పిల్లలు."

ఎందుకన్నట్లు చూచాడు.

"నీ వింకా తాగుతున్నందుకు."

"సార్."

"ఆ రోజు బార్‌నుండి వస్తున్న నిన్ను ఏ పొజిషన్‌లో చూచానో నీకు తెలియదు."

"సార్ నేనూ. నేను."

"మాట్లాడకు. నీ లాటి గుమాస్తాలు ఇలా తాగి వంటివి, ఇంటివి గుల్ల చేసుకోవడం క్రొత్తకాదు. ఆ కళ్లు, గడ్డం ఎవరు చూసినా నీ వెంత తాగుతున్నావో ఇట్టే చెప్పగలరు. రాత్రంతా బార్లలో గడిపి ఈ విధంగా ఆఫీసు ఫైళ్ల తప్పులు రాస్తున్నావు. నీ భార్యా పిల్లలను గురించి ఒక్కసారి ఆలోచించు. యూ కెన్ గో."

ఆఫీసరు మంచితనానికి చేసిన ఉపదేశానికి పొంగిపోయాడు. ఆయన మంచితనం చూస్తుంటే నిజంగా తనకు తాగుడు అలవాటు వుందని వొప్పేసుకోవాలనిపిస్తోంది. ఈ సమయంలో పండుగ అడ్వాన్స్ అడిగితే ఎంత బావుంటుంది.

"ఎందుకు పండుగ అడ్వాన్స్? తాగనా? వీల్లేదు."

"పోనీ సైకిల్ అడ్వాన్సు."

"నీకు మంచి సైకిలే వుందిగా. అనవసరం."

"పోనీ ఇంక్రిమెంటూ—"

"నీవు తాగడంలేదని మీ ఆవిడ నుండి కాగితం పట్రా "

ఇదేం గోలరా బాబూ. ఆఫీసరంతటివాడు ఆ మాట అంటే పిచ్చి సీత నమ్మేస్తుంది.

వోరి ఆఫీసరూ నీ మంచితనంకూడ ఎంత చెడుగా వుందిరా!


మారీచుడు గదినుండి వస్తున్న సీతారాముడు కుబేరరావును చూశాడు. తన టేబిల్‌మీద కారియర్ వుంచి అన్నాడు.

"అమ్మగారు మిమ్మల్ని పెందలాడే ఇంటికి రమ్మన్నారు."

"ఎందుకు."

"ఎందుకేమిటోయ్- పెళ్లాం పెందలాడే రమ్మంటే" సుబాహు మాటలకు అప్పారావ్ నవ్వాడు.

"మీ చంటిబిడ్డకు విరేచనాలట."




'నా ఖర్మ' అనుకున్నాడు సీతారాముడు.

మూడో వారంలో ఖర్చేమిటి. చంపి పారేస్తే సరి.

అమ్మో! సీత దిగులుపడుతుంది.

వారఫలాలు చూస్తున్న సుబాహు అడిగాడు.

"నీ దేరాసి గురూ"

"కర్కాటకం." విసుగ్గా అన్నాడు సీతారాముడు.

"కేన్సరన్న మాట."

కేన్సరే— అమ్మకు కేన్సరు. తన బ్రతుక్కీ కేన్సరు. సైకిలుకు కేన్సరు. పిల్లల భవిష్యత్తుకు కేన్సరు. అంతా కేన్సరు మయం. చివరకు తన జాతకం కూడా కేన్సరే.

సుబాహు చదువుతున్నాడు.

"ఈ వారం అధిక వ్యయం. రోగ పీడ."

ఎంత బాగా రాశాడు. తనెప్పుడూ చదవలేదు. సుబాహు ఏం చదువుతాడో నని ఎదురుచూశాడు.

''బంధువియోగం.''

''బంధువియోగమా.''

వియోగం అంటే చావడమేగా. ఎవరా బంధువు? అమ్మా లేక చంటిదా?

పిల్లలు తప్ప తనకు బంధువు లెవరున్నారు.

''వారాంతంలో సుఖం.''

సుఖం అంటే బంధు వియోగం తర్వాత సుఖమా. విజయమే-వచ్చిం తర్వాత మందుల ఖర్చు, తిండిఖర్చు తగ్గుతుంది. అంతకంటే సుఖం ఎక్కడుంది. వారఫలాలు బావున్నాయి.

కానీ బంధువియోగమే. . ఎవరు .. ఎవరా బంధువు.

అమ్మా? చంటిదా?

అన్నం తినబుద్ధి కాలేదు.

''నీ మీద నీ భార్యకు ఎంత ప్రేమ గురూ. లేకపోతే నాలుగు గిన్నెల వీండా వోపికగా వేసి పంపుతుందా.''

లంచ్ అవర్‌లో టిఫిన్‌బాక్సు తెరుస్తూ సుబాహు అన్నాడు.

అన్నం పురుగుల్లా వుంది. బంధువియోగం గుర్తుకొస్తోంది.

''అప్పారావ్ ''

''ఊ.''

"ఓ యాభై . . ."

అప్పారావ్ పారిపోబోయాడు.

కాళ్ళకు అడ్డంపడ్డాడు.

"తప్పదు."

"తప్పినా లేవు."

"పిల్లదానికి విరేచనాలు."

"కుబేరుడ్ని అడుగు."

"వాడి దగ్గర తీసుకుంది ఇంకా ఇవ్వలేదు."

"నే చెబుతాను వుండు."

కార్డిగన్లు కుబేరరావు ముందు వినయంగా నిలబడ్డాడు సీతారాముడు.

"పోయిన నెల వడ్డీ ఇవ్వనేలేదు."

"వచ్చే నెల ఇస్తాడు. పాపం పిల్లలు గలవాడు."

ముఖం వికారంగా పెట్టాడు సీతారాముడు.

"నీవు కాదంటే చస్తాడు."

మెదచుట్టూ వురితాడు వున్నట్లు నటించాడు సీతారాముడు.

కారియర్లో కుబేరరావు రెండొందలు తీశాడు.

కుబేరరావు ఎంత మంచివాడు. ఎంత జాలిగుండె కలవాడు. సమాజంలో ఇలా వడ్డీలకు ఇచ్చేవారంటే ఎందుకు నీచంగా చూస్తారు.

"రెండు నెలలుగా మీరు బాకీపడిన వడ్డీ అరవై రూపాయలు పోను ఇపుడు రెండొందలకు ఇరవై పోను మిగిలిన నూటఇరవై వుంచండి."

అరి దుర్మార్గుడా ఇపుడిస్తున్న డబ్బులో పాతవడ్డీ జమ వేసుకున్నావా! ఎవ్వ అనుకున్నా తప్పదు— కానివ్.

అప్పారావ్ యాభై చేతిలో పెట్టి— "ఇక నీవు నాకు నూటయాభై ఇవ్వాలి."

రెండొందలు అప్పుకుగాను సీతారాముడి చేతిలో యాభై మిగిలాయి అప్పారావ్ ను నమ్మకూడదని లోగడ ఒకసారి అనుకున్నాడు. ఎంత మోస చేశాడు. వాడి అవసరానికి తనను ఎంత బాగా వుపయోగించుకున్నాడు.

ఆఫీసు పని పూర్తయింది.

సైకిలు ఎక్కబోయాడు.

"వెధవ సైకిలు. ఇప్పుడే గాలి పోవాలా"

కాళ్లీడ్చుకుంటూ కొంపకు కదిలాడు.

"ఏమండీ, మధ్యాహ్నం కబురుచేస్తే ఇపుడా రావడం."

"పిలుకావద్దూ"

"బిడ్డ సొమ్మసిల్లిపోయిందిరా సీతా" అమ్మ ఏడుస్తోంది.

ఎదురింటి బామ్మగారు చెప్పారు. కామరాజు వీధిలో సోమరాజు అ పిల్లల డాక్టరుకు చూపించమని. సీత అదే మాట చెప్పింది.

"కామరాజు వీధా" ఎగిరిపడ్డాడు.

"అవునండీ. ఇప్పటికే ఆలశ్యం అయింది. రిక్షా పిలవండీ."

"మరో డాక్టరు దగ్గరకు వెళ్దాం"

"సోమరాజుగారి కేం."

"సీతా! నా మాట విను."

"మీ మాట వినే నా బ్రతుకిలా గయింది."

"నీ బ్రతుకేక్కిం?"

"అవును. రాజావారి దగ్గర పట్టపురాణివి. నా బ్రతుకేక్కిం."

పిల్లలు బిక్కు-బిక్కుమని చూస్తున్నారు. చంటిదానికి ఏడవను శక్తి లేదు. కొడుకూ కోడలు తగాదా ఎలా సర్దాలో తెలియక మూలుగుతోంది తల్లి.

"నోర్మూయ్."

"గొంతు పిసికిపారేయండి." సీత ఏడుస్తోంది.

సీతను అనవసరంగా ఏడిపించాననుకున్నాడు. కామరాజు వీధిలో సోమరాజుగారి దగ్గరకు చంటిదాన్ని తీసుక వెళ్ల వలసిందే. కాపీ తన బాధ తెలియడు కదా! అర్వెళ్ళనుండి ఆ బజార్లో కనకాభిషేకం చేస్తామన్నా వెళ్ళలేకపోతున్నాడు.

"సీతా" బ్రతిమిలాడుతున్నట్లు పిలిచాడు.

"రిక్షా పిల్చాను. కామరాజు వీధిలో సోమరాజు... "

చంటిదాన్ని భుజాన వేసుకుని రిక్షా ఎక్కింది తనూ రిక్షా ఎక్కాడు.

రిక్షా కదిలింది.

ఎన్నాళ్లయింది సీతతో ఇలా రిక్షా ఎక్కి. అపుడు సీతనుండి వస్తున్న మల్లెపూల వాసన ఎంత మత్తుగా వుండేది. ఇపుడు చంటిదాని వాసన, కష్టాల వాసన, తన అసమర్థత వాసన— ఇన్ని వస్తున్నాయి.

"సీతా కళ్లు తుడుచుకో."

"నా ముఖం ఎవరూ చూడర్లెండి."

"నెమ్మది రిక్షావాడు వింటాడు."

"మన బతుకు తెలియకపోతేగా"

అంత బాధలోనూ సీత ఎందుకో నవ్వింది.

సీత నవ్వుకు కారణం అర్థంకాలేదు సీత చూచినవైపు చూచాడు.

మూగమనసులు సినిమా వాల్‌పోస్టరు.

ఈ సినిమా మళ్లా వచ్చిందా!

పెళ్లయిన కొత్తల్లో ఆ సినిమా కొత్తగా వచ్చినపుడు, ఆ సినిమాహాల్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది కాబోలు. సీత కోపం కొద్దిగా తగ్గినట్లుంది.

"ఆ సినిమా గుర్తుంది కదూ. చాలా బావుంటుంది."

"మన బతుకులాగే వుంటుంది."

సీతారాముడు ఇక మాట్లాడలేదు.

ఆ మలుపులోనే కామరాజు వీధి వుంది. సీతారాముడు గుండె దడదడ లాడుతోంది. చెమటలు పడుతున్నాయి.

హాస్పిటల్ ముందు రిక్షా ఆగగానే లోపలకు పరుగుతీశాడు. భర్త కంగారు సీతకు అర్థంకాలేదు. ఎందుకీ మనిషి ఇంత భయపడుతున్నాడు అనుకుంది.

డాక్టరు పరీక్షచేసి, కంగారేమీ లేదని చెప్పాడు. మందులిచ్చాడు.

వెధవ రిక్షా సమయానికి కనబడదు. ముఖానికి చేతులుంచుకుని కాసేపు నిలబడ్డాడు. చంటిదాన్ని అందుకుని మరికొద్దిసేపు... ముఖానికి అడ్డు వుంచాడు.

భర్త చేష్టలు అర్థంకాని సీతకు వొళ్లు మండుతోంది.

"కొత్తగా కప్పించడం మానేశారు."

అనుకున్నంత పనీ అయింది.

కామరాజు ధిలోపీ సోమరాజు డాక్టరు ఇంటి కెదురుగా రామిశెట్టి కిరాణా దుకాణం.

"సీతా! నీవు వెళ్లు. నే వస్తాను."

భర్త భయం సీతకు అర్థమయింది. భర్తను పక్కకు పిల్చింది.

"ఎంత ఇవ్వాలి."

"అబ్బే ఏం ఇవ్వక్కర్లేదు. వాడూ నేనూ కలిసి చదువుకున్నాం. స్నేహం అంతే." అన్నాడు కంగారుగా.

"అవును శెట్టి వయసు అరవై, మీకు ముప్ఫయినాలుగు. పాపం కలిసి చదువుకున్నారు."

సీత రిక్షా ఎక్కింది.

ఛీ అబద్ధం ఆడటం కూడ చేతకాదు. సీతకు తెలిసిపోయింది.

"ఆ బాకీ నిలబడిపోయింది."

"అవును, నిలబడింది."

"ఇది మర్యాదస్థుల పనేనా."

సీతారాముడు మాట్లాడలేదు.

"సరుకులు తీసుక వెళ్లారు. తిన్నారు. డబ్బుకాడి కొచ్చేసరికి నా కేదో వూరికే ఇస్తున్నట్లు బాధపడతారు. ఎగగొట్టిన సొమ్ము అరగదు."

సీతారాముడికి కోపం రాలేదు. రామిశెట్టిమీద జాలివేసింది. అతను వ్యాపారస్థుడు. ఎన్నాళ్లని ఆగుతాడు.

"ఒకటా రెండా! అర్నెల్లు. ఈ రోజు ఇవ్వందే కదిలేది లేదు. అంతే."

"నెల చివర్లో ఇస్తాను."

"నెల మొదట్లో ఇచ్చావా! బాకీ వుందని బజారు ముఖమే చూడని వాడివి. నిన్నెలా నమ్మడం."

డాక్టరు ఫీజుకు, మందులకు, రిక్షాలకు పోను అరవై పైసలు మిగిలాయి. రామిశెట్టి కాళ్ళమీదపడటం తప్ప మార్గంలేదు. తనెప్పుడు ఎవరినీ మోసం చేయలేదు. ఇపుడు చేయవలసిన అవసరం వుంది.

"మీ బాకీ ఎంత."

"ఎనభై."

"ఇంటికి రండి ఇస్తాను."

"మీ ఇంటికా? అంతదూరం నావల్ల కాదు!"

"డబ్బు తీసుకరాలేదు. ఎనిమిదిగంటలకు రండి."

"పదండి. నేనూ మీ వెంట వస్తాను."

పెద్ద చిక్కులో పడ్డాడు సీతారాముడు. ఏం చెప్పాలో ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు. చివరకు అన్నాడు.

"సేల్స్‌టాక్స్ ఆఫీసరు మా బాబాయి. ఆయన ఇంటి తాళాలు నా దగ్గరున్నాయి. అవి ఆయనకు ఇచ్చి వస్తాను."

"ఆఫీసరుగారు మీ బాబాయా!"

"అవును. కొత్తగా వచ్చాడు."

శెట్టి కంగారుపడిపోయాడు.

"అట్టాగయితే పని చూసుకునే రండి. ఎనిమిదిగంటలకు ఇంటిదగ్గర వుంటాను." రామిశెట్టి వెళ్ళిపోయాడు.


మనసు కుదుటపడింది.

శెట్టి అనుకున్న సమయానికి ఇంటికి చేరతాడు. తను పదిగంటలకు చేరితే గండం తప్పించుకున్నట్లే. అప్పటిదాకా ఏం చేయాలి.

చంటిదాని కెలా వుందో. మనసు పీకుతోంది. రామిశెట్టికి పూర్తిగా మానవత్వం లేదు.

నెల రెండోవారంలో వో సారి.... బియ్యం సరుకులు అయిపోయాయి. రామిశెట్టి గడప తొక్కక తప్పలేదు.

"ఏంపనిమీ దొచ్చారు."




సీతారాముడు కూర్చున్నాడు.

"సరుకులు కావాలి. నెలాఖరులో ఇస్తాను."

"ఎంతమాట. మీరు అడగడమూ– నేను కాదనడమా."

ఆ మాట అన్న తర్వాత రామిశెట్టి ఇంక పలుకరించలేదు. అర్థగంట అయింది. ఎవరో వచ్చారు. చిరిగిన బట్టలు, మాసిన తల, కళ్లలో ఆకలి.... దీనంగా వున్నాడు.

"ఏరా వొళ్లు బలిసిందా." శెట్టి.

ఎవరిని అన్నాడో సీతారాముడుకి అర్థంకాలేదు.

"ఎవడబ్బ సొమ్మని మళ్లీ అప్పుకొచ్చావ్? యాభై రూపాయిలు ఇవ్వలేని వాడివి, నీకు సంసార మెందుకు. సన్యాసుల్లో కలిసి చావరాదూ."

సీతారాముడు రామిశెట్టిని చూశాడు.

"అంతే రోషం. తిన్న సొమ్ము ఇవ్వాలన్న బుద్ధీ జ్ఞానం వుండ నక్కర్లేదా! ఏ ముఖం పెట్టుకుని వచ్చావ్. సిగ్గు లేకపోతే సరి."

ఆ వచ్చినవాడు వింటూ కూర్చున్నాడు.

సీతారాముడు వింటూ కూర్చోలేకపోయాడు.

"వస్తాను రామిశెట్టిగారు."

రామిశెట్టి మాట్లాడలేదు.

"వెధవకుంక. పౌరుషం ఒకటి. ఇన్ని మాటలంటే బాకీ విసిరేస్తావని ఒక్క మాట అని చావవేం."

ఎవరిని వుద్దేశించి ఆ మాటలు అంటున్నాడో ఊహించుకున్న సీతారాముడి రక్తం వుడికిపోయింది. చెంపలు వాయించాలి. గుండెల్లో బాకు దించాలి.

కానీ—

"మిమ్మల్నెందుకంటానండీ" అంటే ఏంచేయాలి. వాడు ఎంత తెలివిగా వాతలు పెడుతున్నాడు.

సీతారాముడు కదిలాడు.

"ఆ పాత బాకీ   "

"నెలాఖరులో ఇస్తాను."

రెండడుగులు వేశాడో లేదో   శెట్టి కేకలు పెడుతున్నాడు. ఆ మనిషి శెట్టిని పట్టుకుని బాదుతున్నాడు.

"ముష్టి రెండ్రూపాయలకు నానా మాటలు అంటావా" రామిశెట్టిని ఒంగ దీసి గుద్దుతున్నాడు. జనం పోగై వింత చూస్తున్నారు.

"సెహబాష్" అనుకున్నాడు సీతారాముడు.

తను చేయలేని పని వాడు చేస్తున్నాడు. ఆ మాటలు తనను అన్నవేనని తెలిసీ ఏం చేయలేకపోయాడు. వాడు వూరుకోలేదు. ఆ ధైర్యం, తెగింపు తనలో ఎందుకు లేవో అర్థంకాలేదు. దొంగకు తేలుకుట్టిన విధంగా లేచివచ్చేదేగాని ఒక్కమాట అనగలిగాడా!

జోహార్ బ్రదర్ నీ ధైర్యానికి!

వెధవ మధ్య తరగతి మనస్తత్వం— ఉగ్గుపాలతో రంగరించుక పోసు కున్నవాడిని. నీలా గుండె ధైర్యం వుంటే నా బ్రతుకిలా ఎందుకవుతుంది. లేని దానికోసం ఏడవడం, ఉన్నదానిలో తృప్తిపడటం మాకు చేతనైన విద్య. భవిష్యత్తుమీద ఆశేగాని అధికారం లేనివాళ్ళం వర్తమానాన్ని అనుభ

వించడమేగాని ఎదిరించడం చేతగానివాళ్ళం. జోహార్ బ్రదర్ నీ ధైర్యానికి. నీ కాళ్ళమీద పడితే అందరూ ఎగతాళిచేస్తారని, మనసులోనే ఆ పనిచేస్తున్నాను. ఇలా మా అభిమానాన్ని కాపాడుకుంటాం.

* * *

చంటిదాని కెలా వుందో.

"హై మెంతయిందండీ!"

"తొమ్మిది".

పాపకు అమ్మకు ఎలావుందో! రామిశెట్టి ఇంటికి వచ్చి వుంటాడా! ఏం జరిగిందో.

పడుస్తున్నాడు సీతారాముడు.

గోడమీద "పాతాళభైరవి" సినిమా పోస్టరు కనిపించింది.

ఎప్పటి సినిమా! చిన్నతనంలో అమ్మ చూపించి. ఆ రోజులు ఎంత బావుండేవి. ఆ సినిమాలో వాడెవడో మాంత్రికుడు ఏదో చేస్తాడు. గుర్తు సరిగ్గా లేదు. అమ్మవారు ప్రత్యక్షమై బొమ్మ ఇస్తుంది దాన్ని తలకు కొట్టుకుని "జై పాతాళభైరవి" అంటే అమ్మవారు ప్రత్యక్షమై "నరుడా ఏమి నీ కోరిక" అని అడిగిన కోరికలన్నీ తీరుస్తుంది.

చిన్నతనంలో అనిపించేది.

అలాంటి బొమ్మ దొరికితే ఎంత బావుండును. ఆ మాంత్రికుడు ఎక్కడన్నా కనబడతాడా!

"జై పాతాళభైరవి"

"నరుడా! ఏమి నీ కోరిక."

"రేపు పదమూడో ఎక్కం వొప్పచెప్పాలి. లేకపోతే మాస్టారు తంతాడు. అందుకని స్కూలుకు సెలవు ఇప్పించు. మా నాన్న కాంతం దగ్గరకు పోకుండా చూడు. మా అమ్మ అసలెప్పుడూ ఏడవకూడదు. అప్పడాలు అమ్మి- అమ్మ బియ్యం తెస్తున్నది. అందుకని అమ్మ కష్టపడకుండా రోజుకో వెయ్యి అప్పడాలు ఇప్పించు."

ఇలాంటివి ఎన్నో కోరికలు. చిన్నతనంలోని సమస్యలు, బాధలు వయసొచ్చాక రంగులు మార్చుకుంటాయి.

సినిమా చూస్తే బావుండు. అమ్మ పక్కన కూర్చుని సినిమా చూసిన రోజులు గుర్తుకొచ్చి కొద్దిసేపయినా మనసు విశ్రాంతిగా వుంటుంది.

చంటిదాని కెలావుందో.

"జై పాతాళభైరవి."

"నరుడా ఏమి నీ కోరిక?"

"అమ్మకు కేన్సరు. వెంటనే బొంబాయి వెళ్ళాలి. రామిశెట్టి, పఠాన్, కుబేరరావుల అప్పులు తీర్చాలి. నా సైకిలుకు కొత్త ట్యూబులు, టైర్లు కావాలి. నేను మందు తాగుతాననుకునే ఆఫీసరు అనుమానం నాశనం కావాలి. ఇంటద్దె తగ్గాలి. పాలవాడు నీళ్లుపోయకుండా చూడు."

పాతాళభైరవి దొరికితే ఎంత బావుండును.

హాలు దగ్గర జనం బాగానే వున్నారు.

నేల క్యూలో చాలామంది వున్నారు.

క్యూలో నిలబడ్డాడు.

నేల టిక్కెట్టు చాలా అసహ్యంగా వుంటుంది. మనుషుల్లో తేడాలున్నట్లు ఈ టిక్కెట్లేమిటి. అంతా ఒకే క్లాసు చేయాలి. ఇలా వర్గాలు చేయడంవల్లనే సోషలిజం దూరమైంది.

క్యూ కదులుతోంది.

చంటిదాని కెలావుందో.

రామిశెట్టి వచ్చి వుంటాడు.

"ఇంకా పదిపైసలు ఇవ్వు."

జేబులు వెదికాడు. పదిపైసలు లేవు

బుకింగు మనిషి విసుక్కుంటూ చిల్లర బైటకు నెట్టాడు.

పదిపైసలు వెధవ పదిపైసలు తన ఆనందాన్ని, ఉత్సాహాన్ని దూరం చేసింది. ఎవరిని అడగాలి. ముష్టివాడి చేతిలో పదిపైసలు కాజేస్తే ఛీ ... ఛీ ... బాబూ పదిపైసలు ఎవరైనా సరే ఇవ్వండి. పదిరూపాయిలు వడ్డీ ఇస్తాను.

హాలు బైటకు వచ్చాడు.

"జై పాతాళభైరవి."

"నరుడా ఏమి నీ కోరిక"

"నన్ను చంపెయ్యి."

రోడ్డున పడ్డాడు.

చంటిదాని కెలా వుందో.

పది కావస్తోంది.

శెట్టి వెళ్లిపోయే వుంటాడు. ఇంటికి చేరడం మంచిది.

"సినిమాలు కళ్లకు మంచివి కావు. నేల టికెట్టునుండి చూస్తే కళ్లు దెబ్బతింటాయి."

ఎంత సమర్థించుకున్నా చావని ఉత్సాహం చంపుతోంది.

అరవై పైసలు నానా అల్లరి చేస్తున్నాయి.

సీత గుర్తుకొచ్చింది.

పేవ్‌మెంటు మీద మల్లెపూలు రాసులుపోసి అమ్ముతున్నారు.

మల్లెపూల పొట్లం కట్టించుకున్నాడు.

"సీత తలలో మల్లెపూల వాసన చూసి ఎన్నాళ్లయింది."

"జై పాతాళభైరవి. నన్ను నా సీత దగ్గరకు చేర్చు."

సీత తలుపు తీసింది.

"ఇంత ఆలశ్యం చేశావేంరా" పంచలో తల్లి అంది.

సీత చేతిలో మల్లెపూలు వుంచాడు.

చిలిపిగా నవ్వాడు.

అన్నం పూర్తయింది.

పిల్లలు నిద్రపోతున్నారు.

"చంటిదానికి ఎలా వుంది."

సీత మాట్లాడలేదు. తనకంటూ మిగిలిన ఆనందం సీత ఒక్కర్తే.

"సీతా."

"మల్లెపూలు ఏం చేశావ్."

"శెట్టిగారు వచ్చారు. నానా మాటలు అన్నాడు. సేల్సుటాక్సు ఆఫీసరు బాబాయి అవి చెప్పారట. ఎగిరిపడ్డాడు. నలుగురూ చేరారు. గొడవెందుకని ఇత్తడిబిందె ఇచ్చి పంపాను."

ఉత్సాహం ఉరిపోసుకుంది.

తను తెచ్చిన మల్లెదండ దేవుడు పటానికి వేళ్లాడుతోంది.

"జై పాతాళభైరవి. నన్నూ నా ఇంట్లో వాళ్లందర్నీ చంపెయ్. మళ్లీ ఇటువంటి జన్మ లేకుండా, రాకుండా కాపాడు."

* * *

## నాలుగో వారం

అనగనగా ఓ గుమాస్తా. గుమాస్తా పేరు సీతారాముడు. అతని ఆర్థిక

జీవితం పాలుగోవారంలో పడింది. రోజూ వచ్చే చావుకు ఎన్నాళ్లు ఏడుస్తారు. సీతారాముడూ అంతే. ప్రతినెలలో మొదటి మూడు వారాలు అనుభవించి రాటు తేలాడు.

అదుగో సీతారాముడు అతనిలో ఎంత మార్పు. అది మార్పా! మిగుల్చు కున్న విసుగుదలా! విప్లవవాదిలా కనబడుతున్నాడు. అది విప్లవం కాదు. కసి... కసి

"మర్యాదగా మాట్లాడు." సీతారాముడు.

"అసలు నీళ్లే పోస్తాను. నా ఇష్టం నా డబ్బులు పారేయండి."

"నీళ్లపాలకు డబ్బులా! అసలివ్వను. ఏం చేస్తావో చెయ్యి."

"కక్కిస్తాను."

"నీ దిక్కున్న చోట చెప్పుకో."

పాలవాడు తిట్టి అలసిపోయాడు.

"ఎట్లా రావో నేనూ చూస్తాను."

"నెల చివర్లో తగాదా ఏమిట్రా సీతా" తల్లి.

"ప్రతి నెలాఖరులో ఇలా పిచ్చెక్కుతుందేం ఈ మానవుడికి." సీత అనుకుంది.

పాలు పోయకుండా పాలవాడు వెళ్లిపోయాడు.

"వాడు పాలు పోయకుండా వెళ్లాడు పిల్లల గతేమిటి."

"గొంతు పిసికి అవతల పారెయ్."

"ఏమిట్రా ఆ కోపం. అవాచికం మాటలు." తల్లి.

నేలమీద గ్లాసు దొర్లుతోంది.

"సీతారాముడు–సీతవివాహ శుభ సందర్భంలో... "

కాలుతో ఒక్క తన్ను తన్నాడు. సీతకు గ్లాసు తగిలింది.


"అబ్బ.... ఎవరిమీద మీ కోపం."

సైకిల్ తీసుక కదిలాడు. పెద్దది ఎదురొచ్చింది.

"నాన్నా నా నోట్సు పుస్తకం ఏది కొనివ్వు."

సైకిల్ పట్టుక ఏడుస్తోంది.

"వెధవ చదువులు వెధవ పుస్తకాలు. ప్రపంచానికి పనికిరాని పుస్తకాలు కొని మీ చేత చదివించను నేను వెధవను కాను. ఈ చదువుల్లో ఏమీలేదు, మోసం తప్ప. అందుకే పుస్తకం కొనలేదు సిలబస్ ప్రకారం విజ్ఞానం




బోధించను వీరెవరు. విజ్ఞానానికి హద్దులు ఏర్పరచను వీరెవరు. అసలు రెం.డో క్లాసుకు ఘోషలెందుకు."

సీతారాముడు చెప్పుకుపోతున్నాడు. సీతారాముడు ఉపన్యాసానికి ఏడుస్తున్న పెద్దది తక్కున నోరు మూసుకుంది. గడపదగ్గర నిలబడ్డ సీతకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు. తన కొడుక్కి పిచ్చెక్కుతుందేమోనని తల్లి భయపడింది.

"కాబట్టి అందుకే ఘోషలు పుస్తకం కొనలేదు. కొనను."

"కాదు కొనాల్సిందే." ఏడుస్తోంది పెద్దది.

నాలుగు అంటించాడు. సీత పరుగునవచ్చి పిల్లను తీసుకుంది.

"చెప్పడం చేతకాదు కానీ— కొట్టడం మాత్రం—"

"నోర్ముయ్. చంపేస్తాను."

సైకిలు తీసుకుని కదిలాడు.

"ఎందుకమ్మా వాడంత మండిపోతున్నాడు—"

"నెలాఖరు రోజులు కదూ" అలవాటయిన సీత అత్తగారితో అన్నది,

నెలాఖరు రోజులలో ఎందుకంత కోపం వస్తుందో కారణం తెలియదు సీతారాముడికి.

"అబ్బ కాఫీ లేదు. తల పగిలిపోతోంది"

చేతిలో చిల్లికాని లేదు. సైకిలులో గాలి తగ్గింది. షాపు ముందు నిలబడి సైకిలు చూచి నవ్వుకున్నాడు సైకిలుషాపువాడు.

"ఏమయ్యా ఎందుకు నవ్వుతున్నావ్. దోపిడీ వ్యవస్థ వున్నంత కాలం మేం ట్యూబులు టైర్లు ఏం కొంటాం. వాటిని తయారుచేసే సంస్థలు గుత్త పెట్టుబడిదారుల చేతుల్లో నలుగుతున్నాయి. అందుకే సామాన్యుడికి అందుబాటులో లేని ధరలు. టైర్లు, ట్యూబుల ఫాక్టరీలు జాతీయం చేసేదాకా నిరాహారదీక్షచేస్తాను. పావలాకు ట్యూబూ, అర్ధకు టైరు ఇచ్చేదాకా విశ్రమించను.

ఉపన్యాసం విని బిత్తరపోయాడు సైకిలుషాపువాడు.

సీతారాముడి రథం కదిలింది— ఆఫీసువైపుకు.

సైకిలు బ్రేకు వేయలేదు వేయను బ్రేకు లేదు. కానీ ఆగింది.

ఎదురుగా పఠాన్!

"క్యా భాయ్— మనుష్యులు కనిపించడం లేదా!"

సైకిలుమీద చెయ్యివేసి భయంకరంగా నిలబడ్డాడు.

"వడ్డీ నీ బాబుగాడిస్తాడా."

సీతారాముడిలో రోషం పెరిగింది.

"మర్యాదగా మాట్లాడు."

"నీకూ్కడా మర్యాదా."

"అంటే నే మనిషిని కానా."

"మాట లనవసరం. ముందు వడ్డీ కట్టి కదులు."

జనం చేరారు. సీతారాముడ్ని చూచి జాలిపడుతున్నారు. పఠాన్ చేతిలో చావు తప్పదని సానుభూతిని ప్రదర్శిస్తున్నారు.

"నీకు కట్టిన వడ్డీకి అసలు సరిపోయింది. ఇంకా మించిపోయింది."

"మోసం— మోసం."

"నీలాటివాళ్ళకు వడ్డీలు కట్టలేక ఎన్ని కుటుంబాలు సర్వనాశనం

అయ్యాయి. కడుపు కొట్టుకుని నీకు వడ్డీలు కట్టాను. ఇక కట్టను. నీవు చంపినా —వరికినా సరే."

అక్కడ చేరిన ప్రజల సానుభూతిని సంపాదించుకున్నాడు సీతారాముడు.

"నీ రక్తం చూస్తాను." కత్తి తీశాడు పఠాన్.

సీతారాముడు కలియబడ్డాడు— జనం విడదీస్తారనే నమ్మకంతో. కానీ ఎవరూ ముందుకు రావడంలేదు. పఠాన్ చేతుల్లో చిత్తుకాగితంలా నలిగిపోతున్నాడు.

"ప్రజలారా రండి. చూస్తారేం. ఈ వడ్డీ రాక్షసుడి చేతుల్లో మీరూ నలిగారు ఇది దోపిడి. దీనికి కళ్లు మూసుకుంటె మన జీవితాలు సర్వనాశన మౌతాయి. ఎదురుతిరుగుదాం— పోరాడదాం రండి— రండి "

సీతారాముడి అక్కడి వారందరినీ కదిలించాడు. అందరూ పఠాన్‌మీద పడ్డారు. ఊహించని సంఘటనకు భయపడ్డాడు పఠాన్.

"ఖబడ్దార్ ప్రజాబలం ముందు నీ ధనబలం ఎంత? మరోసారి నీ దోపిడి సాగితే నీ చావు ఖాయం."

సీతారాముడు భయంకరంగా ఉన్నాడు

పఠాన్ చూడలేకపోయాడు.

రధం విప్లవరధం కదిలింది.

"ఏం భాయ్ పఠాన్‌ను అదరగొట్టావటగా." ఆఫీసు చేరగానే అన్నాడు అప్పారావు.

"ఎవరు చెప్పారు."

శూర్పణఖ రావణాసురుడులా నవ్వింది.

"అతను మాత్రం ఎన్నాళ్ళు వూరుకుంటాడు. పిల్లికూడా పులి అవుతుం దంటారు ఇందుకే కాబోలు." సుబాహు.

సుగ్రీవుడొచ్చాడు.

"మారీచుడుగారు పిలుస్తున్నారు."

సీతారాముడు తలెత్తి చూచాడు.

"పనిచేస్తున్నాను. వీలుకాదు "

ఆఫీసులో ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"చాలా ముఖ్యమైన పనట.... త్వరగా ...."

"అసలు రాను. ఎంత ఆఫీసరయితే మాత్రం గుమాస్తాను వెధవగా చూడటంలో అర్థం ఏమిటి. మాటిమాటికి రాను. నేను ఆయనగారి బానిసను కాదు."

సుగ్రీవుడు వెళ్ళిపోయాడు.

"ఏంటి గురూ మాంచి వేడిమీదున్నావు"

"నెలాఖరు కదా."

"ముందు కాఫీ చప్పరించు." అప్పారావు కాఫీ పంపాడు.

కప్పు చూశాడు.

"సీతారాముడు.... సీతల వివాహ "

అక్షరాలు లేవు.

కాఫీ ఎంత బావుంది. ఆ అక్షరాలున్న గ్లాసులో కాఫీ తాగితే ఎంత చేదు.

సుగ్రీవుడు మళ్లీ వచ్చాడు.

సీతారాముడు విసురుగా ఫైలు మూసి ఆఫీసరు గదిలో అడుగుపెట్టాడు.

"పిలిస్తే రాలేదు. ఎందుకని."

"ఆఫీసు పని చేస్తున్నాను."

"ఆఫీసరు పిల్చినా రావా"

"ముఖ్యమంత్రయినా సరే."

"అంత సిన్సియరన్నమాట."

ఆఫీసరు నవ్వాడు.

"నీ సీటు మారుస్తున్నాను."

పిలుపు వెళ్లింది. సుబాహు వచ్చాడు.

"చెప్పవయ్యా విషయం."

"చూడు సీతారాముడూ అయ్యగారు నీ పరిస్థితిని గురించి విన్నారు. బాధపడ్డారు. అప్పారావ్ బిల్స్ సెక్షన్‌లో కావలసినంత సంపాదించుకుంటు న్నాడు. ఇపుడా బిల్స్ సీటు నీది."

సీతారాముడుకి అర్థంకావడంలేదు.

"వసూలు నీవు చేసుకో. వచ్చినదాంట్లో సగం మారీచుడుగారికి— మిగిలింది చెరి సగం... ఇది పాత సాంప్రదాయమే"

అమ్మ జబ్బు.... పిల్లదాని నోషలు పుస్తకం.... పరాన్ అప్పు.... రామిశెట్టి లాక్కుపోయిన బిందె . ఒక్కసారిగా మెదిలాయి.

లంచగొండితనానికి తాను ప్రతినిధి కావాలి. కాంట్రాక్టర్ల బిల్స్ పాస్ చేయాలి. దానికి వారెందుకు లంచం ఇస్తారు. వారు చేసే పనిలో ఏదో లోపం వుంటుంది- అందుకని.

ఆ కాంట్రాక్టర్ కట్టిన స్కూలు బిల్డింగు కూలి పిల్లలు చస్తే ఆ శవాల్లో నా పెద్దకూతురు ఎందుకుండదు. రోడ్లు బాగుచేస్తే రెండో రోజుకే పగిలిపోతే తన సైకిలు విరిగిపోదా! కట్టిన హాస్పిటల్ కూలిపోతే అందులో తన తల్లి వుంటే——?

అలా ఎందరి ప్రాణాలు అల్లాడతాయి

"ఏమిటి ఆలోచిస్తున్నావ్."

"నావల్ల కాదు. నా జీతం నాకు చాలు."

"అమాయకుడా ఎలా బ్రతుకుతావ్."

"విజాయితీగా."

"అంటే మేం వెధవలమా "

మారీచుడు కోపంగా అన్నాడు.

"అది మీకే తెలియాలి "

సీతారాముడు అక్కడినుండి కదిలాడు సీట్లోకి.

"థాంక్స్ గురూ" కళ్లతో అన్నాడు అప్పారావు.

లంచ్ అవర్‌లో నాలుగు గిన్నెల కారియర్ ముందు కూర్చున్నాడు సీతారాముడు.

కుబేరరావుకు మాట్లాడను భయంగా వుంది. చివరకు అన్నాడు,

"పిల్లలు గలవాడ్ని. నా పైసలు మాత్రం ఎగగొట్టొద్దు దయచూపండి. "ధర్మవడ్డీ ప్రకారం ఇస్తాను."

"ఆ మాట చాలు బాబు "

ధన్‌మని చప్పుడయింది.

అందరూ అటుకేసి చూశారు.

సీతారాముడు క్యారియర్ నేలమీద దొర్లుతోంది. నాలుగు గిన్నెలు విడిపోయాయి పై మూడు గిన్నెలు ఖాళీలు. ఆడుగు గిన్నెలో రెండు గుప్పిళ్ల అన్నం కాసివి మజ్జిగ.

అందరూ సీతారాముడ్ని చూచారు.

"నా నాలుగు గిన్నెల కారియర్ రహస్యం తెలిసిందా! నెల చివర్లో తినే విందు ఇదే."

బైటకు నడిచాడు.

సాయంత్రం నాలుగయింది.

"ఆఫీసులో క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నాడు పార్టీలను లంచా లివ్వమని పీడిస్తున్నావని రిపోర్టులు వస్తున్నాయి. రాత్రిళ్లు నీ చెడు ప్రవర్తన వల్ల పగలు ఆఫీసులో పనిని అశ్రద్ధచేస్తున్నావని అర్థం అవుతోంది. పై కారణాల వల్ల నీ మీద క్రమశిక్షణా చర్య తీసుకొని వారం దినాలు ఎందుకు సస్పెండు చేయరాదో సంజాయిషీ చెప్పవలసింది "

కోపంతో ఊగిపోతున్నాడు ఈ అన్యాయాన్ని బట్టబయలు చేయాలి. గొంతెత్తి అందరినీ పిలిచాడు జరిగిన విషయం చెప్పాడు.

"ఈ ఆఫీసర్ల అధికారదుర్వినియోగం మన జీవితాల మీదనా! డియర్ ఫ్రెండ్స్-ఈ రోజు నాకు, రేపు మీకు ఈ అన్యాయం ప్రతి ఒక్కరికి జరగక మానదు. మనం గుమాస్తాలం. ప్రభుత్వం అనే భవంతికి ఇటుకరాళ్లం. మనం లేకపోతే ప్రభుత్వమేలేదు. కానీ మనకు విలువా-గుర్తింపులేదు. ఈ అన్యాయం ఎదురిద్దాం "

ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

ఆఫీసు గడియారం ఆరుగంటలు కొట్టింది.

ఆఫీసులో ఎవరూ లేరు.

గుమాస్తాలలో ఐకమత్యం లేదు

అంతా చీకటిగా వుంది.

చీకట్లో ఏదో తళుక్కున మెరిసింది.

సీతారాముడు అన్నాడు.

"ఎవరూ?"

సమాధానం లేదు.

కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

పఠాన్ పఠాన్ చేతిలో కత్తి.

"నీవా!"


మాట్లాడే అవకాశం లేదు. కత్తి గుండెల్లో దిగబడింది.

"అమ్మా!"

• • •

"అమ్మా" అని అరిచాడు.

మంచంమీద అమ్మ లేవలేదు.



"ఏమండీ మిమ్మల్నే ఎందుకు కలవరిస్తున్నారు. లేవండి మీ అమ్మ మాట్లాడటంలేదు."

సీత నిద్రలేపుతోంది.

సీతారాముడు కంగారుగా లేచాడు.

గుండెలు చూసుకున్నాడు. రక్తం లేదు. కత్తి లేదు. ఎదురుగా పరాన్‌లేడు.

అంతా పీడకల.

తేలిపోతున్న కళ్ళతో చూస్తోంది అమ్మ.

"ఏరా సీతారాముడు— నీ ఇచ్చిన కడుపునొప్పి మాత్రలతో కేన్సరు ఎలా తగ్గుతుంది నాయనా."

"అమ్మా" అంటూ ఏడ్చాడు.

సీత వోదార్చింది.

లోపలకు తెస్తూ అంది

"నాకేదో భయంగా వుంది. డాక్టరుకు చూపండి."

సీతారాముడు పేలవంగా నవ్వుకున్నాడు.

"లాభంలేదు సీత అమ్మకు రోజులు దగ్గరకొచ్చాయి. ఏ డాక్టరూ ఏమీ చేయలేడు అమ్మకు కేన్సరు. సంవత్సరంగా ఈ విషయం నా మనసులో పెట్టుకుని ఎంతగా కుమిలిపోతున్నానో నీకు తెలియదు. ఈ బాధను ఒంటరిగానే అనుభవిస్తున్నాను. కేన్సరుతో అమ్మ ఎంత బాధపడుతున్నదో తెలియదుగానీ— ఈ రహస్యం నా శరీరంలో కేన్సరుకన్నా భయంకరంగా బాధిస్తోంది."

ఆ విధంగా సీతకు చెప్పినందువల్ల ఏం ప్రయోజనం.

కాలెండరు మీద ఇరవై ఏడవ తేది కనిపిస్తోంది. జీతాలకు ఇంకా మూడు రోజులు ఆగాలి.

షరాన్ను ఆ విధంగా ఎదిరించగలడా? అప్పారావు సీటు తన కిస్తారా, నాలుగు గిన్నెల కారియర్ రహస్యం అందరికీ తెలిస్తే ఎంత చులకనగా చూస్తారు.

"కాఫీ."

గ్లాసు అందుకుని నోట పెట్టుకున్నాడు.

చేదుగా వుంది.

"పంచదార అయిపోయింది." అన్నట్లు చూచింది,

తెలుసు. నెలాఖరులో అన్నీ అయిపోతాయని తెలుసు," అన్నట్లు కాఫీ చప్పరించాడు.

గ్లాసుమీద అక్షరాలు ...

ఎంత చేదు దీవెన.

"అమ్మా! అమ్మా!"

గాజుకళ్ళతో చూస్తోంది అమ్మ,

"ఈ మందు వేసుకో"

అమ్మను ఇన్నాళ్ళుగా మోసంచేసిన మాత్రలను గొంతులో వేశాడు,

ఎవరో చచ్చిపోతే మోసుకుపోతున్నారు.

సీత చెబుతోంది.

"పాపం కేన్సరట."

ఆ శవంముందు నిప్పుల కుండతో నడుస్తున్నట్లనిపించింది సీతారాముడికి.

నెల చివరి తేది—

అతను బండెక్కించాడు.

"అత్తయ్యను అలా వదిలి నే వెళ్ళనండి."

సీత తమ్ముడు పెళ్లి గూడూరులో జరుగుతుంది. రమ్మని వ్రాశారు. ఒకటి కాదు రెండు జాబులు వేశారు ఛార్జీలకని యాభై రూపాయలు కూడా పంపారు. కాపురానికి వచ్చిన తర్వాత సీత నాలుగయిదుసార్లు మాత్రమే పుట్టింటికి వెళ్లింది

"అమ్మకు ఏం భయంలేదు. నా మాట విను. రెండ్రోజుల్లో వచ్చేస్తావుగా"

ఆ రెండురోజులైనా సీత ఆనందంగా గడుపుతుంది. తన జీవితంతో ముడిపడినాక ఈ రెండు రోజులన్నా ఆ తృప్తిని సీతకు కలిగించాలి.

సగం మనసుతో కదిలింది సీత.

ఆఫీసులో పనిచేయబుద్ధి కాలేదు సెలవు పారేసి ఇంటికి కదిలాడు.

అమ్మ మూలుగుతోంది.

రేపు జీతాలు ఇస్తారు,

పెద్దదానికి సోషలు పుస్తకం కొనాలి సెకండ్‌హాండ్ టైర్లన్నా సైకిలుకు వేయించాలి. పాలవాడ్ని మార్చాలి అమ్మకు మందు మార్చాలి.

పాతాళభైరవి సినిమా మళ్ళీ వస్తే బావుండును. పై క్లాసులో చూడాలి ఈ నెల ఇంక్రిమెంటు బకాయిలు వస్తాయి. సీతకు ఓ చీరె కొనాలి. పుట్టింటి నుండి రాగానే చీర చూస్తుంది.

"ఎందుకండి. నా కింత ఖరీదుపెట్టి కొన్నారు."

"నా పెళ్లాం నా ఇష్టం. నీ కెందుకు."

ఆ మాటకు సీత నవ్వుతుంది. ఆ నవ్వు ప్రతి నెలా మొదటి తేదీలోనే కనిపిస్తుంది. తనలో ఉత్సాహం కూడా అంతే.

ప్రతిరోజూ ఒకటో తేదీ అయితే ఎంత బావుంటుంది.

అర్ధరాత్రి 12 గంటలయింది.

"అమ్మా! ఎలా వుందే."

ఇంకా పదిహేను గంటలలో జీతం వస్తుంది.

"అమ్మా చచ్చిపోవాలని వుందా। రేపు ఒకటో తేదీ. నాకు జీతాలొస్తాయి మనకు పండుగరోజు. నెలరోజులు కార్చిన కన్నీటికి కన్నీటి తుడుపు. నీ కేన్సరు విషయం ఎవరికీ తెలియకుండా ఎంత తెలివిగా వ్యవహరించానో తెలుసా. నీవు చావాలనుకుంటే రేపే చచ్చిపో. ఒక్కరోజు ఆలస్యంగా చచ్చినా జీతం మిగలదు. నీ శవాన్ని మళ్లీ ఒకటోతారీకదాకా తగలబెట్టకుండా కాపాడుకోవాలి. నీ కొడుకు బ్రతుకుమీద ఏకేమాత్రం జాలివున్నా— రేపు జీతాలు రాగానే చచ్చిపో. ఇంతకంటె ఏన్నేం కోరను."

వెక్కి—వెక్కి ఏడుస్తున్నాడు.

"ఛీ. ఏమిటా పాడు ఆలోచన. అమ్మ చచ్చిపోవడం ఏమిటి. బుద్ధి పెడగా ఆలోచిస్తోంది. తల్లిని కోరవలసిన కోరికేనా అది "

కొన్నీళ్లు తుడుచుకున్నాడు

• • •

ఒకటో తారీఖు.

ఉత్సాహంగా నిద్రలేచాడు

"అమ్మా!"

అమ్మ చూచింది.

"ఎలావుందే— మాత్ర వేసుకో."

తల్లి మాత్ర మింగింది.

"అమ్మాయి లేదు. వంట ఎలా చేస్తావురా సీతా"

అమ్మ మాట్లాడుకోంది. అంత జబ్బులోకూడా బిడ్డ తిండిని గురించి ఆలోచిస్తోంది.

చిన్నపుడు విన్న కథ గుర్తుకొచ్చింది.

ప్రియురాలి కోరికమీద తల్లి గుండెను కోసుకుని ఆ ప్రియురాలికి అందించను పరుగుతీస్తున్నాడు కొడుకు. దారిలో ఎదురుదెబ్బ తగిలిన కొడుకు "అమ్మా" అన్నాడు అపుడు అతగాడి చేతిలోని అమ్మగుండె— "జాగ్రత్తగా వడు నాయనా" అందట.

తల్లిని చూడలేకపోయాడు.

కాసిని బియ్యం వుడకేశాడు.

మజ్జిగరసం తల్లి మంచంక్రింద వుంచాడు.

ఆఫీసుకు బయలుదేరాడు.

సీతారాముడు సైకిల్ని అప్రయత్నంగా ఆగింది.

"సాయంత్రం షాపు వుంటుందా!"

పదేళ్ల నుంచి ఇక్కడే వుంది ఎక్కడకూ పోలేదు."

"సాయంత్రం పైర్లూ ట్యూబులు దొరుకుతాయా!"

"దొరకవు. కొనుక్కోవాలి."

ఎంత ఎగతాళిగా మాట్లాడుతున్నాడు. వెధవకు ఈరోజు ఒకటో తేదీ అవి తెలియదు కాబోలు

సైకిలు కదిలింది.

ఆఫీసు కలకలలాడుతోంది

ప్రతి ఫైలు చకచకా నడుస్తోంది.

'పేబిల్స్' తీసుకుని అప్పారావు కదిలాడు.

రెండు గంటల్లో క్యాష్తో వస్తాడు.

కూర్పణాల టేబిల్ మీద వారపత్రిక ఎగురుతోంది.

పత్రిక అందుకున్నాడు.

"ఏం సీతారాముడూ! వారఫలాలా? పెద్దగా చదువు" సుబాహు.

'వారం మొదటి భాగంలో ధనలాభం'

అవును. ఈ రోజు జీతాలరోజు కాబట్టి ధనలాభమే. వీడు కొత్తగా రాయాలా!

"ఆరోగ్యం కుదుటపడుతుంది."

ఎంత బాగా రాశాడు. అమ్మ అందుకనే మాట్లాడుతోంది. అమ్మకు కేన్సరని డబ్బు గుంజను డాక్టర్లు భయపెట్టారా! అంతే అయింవుటుంది.

'కొత్తవస్తువులు కొంటారు'

పెద్దదానికి నోటులు పుస్తకం, సీతకు చీరె, సైకిలుకు పైర్లూ, ట్యూబులు ఇవన్నీ కొత్తవస్తువు లేగా. వారఫలాలు ఎవరో తన ఆలోచనలు చూసి వ్రాశాడు.

బంధువులను కలుసుకుంటారు.'

బంధువులు తనకెవరున్నారు. సీత బంధువేనా! పెళ్లాం కదూ పెళ్లాం కూడా బంధువేనా.

రెండో తేది మెయిల్కు వస్తానని ఉత్తరం రాసింది. రేపే వస్తుంది

'శత్రువినిర్మూలనం'

తనకు శత్రువు లెవరు. ఆలోచించాడు.

అవును. పఠాన్ తనకు శత్రువే. రామిశెట్టి, కుబేరరావులు కూడా శత్రువులే. పఠాన్ లారీ క్రింద పడి చస్తాడా! అప్పు తీసుకున్న వాళ్లెవరైనా కుబేరరావును హత్య చేస్తారా! రామిశెట్టి గుండె పగిలి చస్తాడా! అలా జరిగితే ఎంత బావుండును. పైవన్నీ జరగకపోయినా ఇదొక్కటీ జరిగితే? .

ఆఫీసు గడియారం ఐదుకొట్టింది.

చెమటలు తుడుచుకుంటూ ఆఫీసులో అడుగుపెట్టాక అప్పారావు,

"ఎందుకింత ఆలశ్యం అయింది."

సమాధానం కోసం ఎదురుచూస్తున్నాడు సీతారాముడు.

"పేబిల్స్‌లో లోపాలు తగలడ్డాయి. ట్రెజరీలో క్వారీ వేశారు. క్యాష్ డ్రా చేయలేదు."

సీతారాముడు గుండె ఆగింది.

వెర్రిగా అరవాలనిపిస్తోంది.

కాలెండర్లో ఒకటో తారీకు నవ్వుతోంది

ఆఫీసును తగలబెడితే బావుండును. నెల మొత్తం కష్టపడి పనిచేశాం. ఏదో చిన్న లెక్క తప్పు జరిగిందని ట్రెజరీవాళ్లు బిల్స్ ఆపితే ఇక్కడ బ్రతుకేం కావాలి."

మనసు చికాకుగా వుంది.

ఆఫీసునుండి బైటపడ్డాడు.

ఎదురుగా పఠాన్! వాడి చేతిలో కర్ర. ఆ కర్రలో కత్తి వుంటుందని అప్పారావు చెప్పాడు.

"వడ్డీ నూటయాభై-భాయ్."

"జీతాలు రాలేదండి."

"నిజంగానా!"

ఏడుపు ముఖం పెట్టాడు.

"రేపు ఐదుగంటలకు వస్తాను.

పఠాన్ వెళ్లిపోయాడు.

సైకిల్ ఎక్కబోయాడు. దూరంగా కుబేరరావు తనను చూచి వస్తున్నాడు. చూడనట్లు పక్కవీధిలోకి తిప్పాడు.

"మిమ్మల్నే."

"చూడలేదు."




"జీతాలు రాలేదటగా."

"రాలేదు."

"రాకపోతే మీరు మాత్రం ఏంచేస్తారు. రేపు ఆదివారం. ఎల్లుండి రాక చస్తాయా."

'ఆదివారమా'

"వడ్డీ నూటపాతికతో అసలు కూడా వో వంద సర్దండి చాలా అవసరం."

ఛీ వెధవ బ్రతుకు.

ఈ బాకీలన్నీ ఎలా తీర్చాలి. ఎప్పుడు తీరతాయి. ఆ సైకిలుషాపు వెధవ చూడటంలేదు. ఇదే మంచి సమయం షాపు దాటాలి.

"అమ్మ కెలా వుందో."

అదిగో ఇల్లు ఎంత దరిద్రంగా వుంది. అమ్మ చచ్చిపోయిందేమో.

"అమ్మా నా కింకా జీతం రాలేదు. ఎందుకు చచ్చిపోయావే."

"నాయనా సీతా! ఒకటో తేదీకి చావమని నీవే కదరా చెప్పావు నీ మాట ప్రకారమే కళ్లుమూసుకున్నాను నాయనా"

"ఒద్దికతక్కువై అన్నాను. ట్రెజరీలో బిల్లుకు క్వారీ పడింది. జీతాలు ఆగాయి. అవి తెలుసుకోకుండా నీవు చచ్చిపోయావు."

తన ఆలోచనలకు నవ్వుకున్నాడు సీతారాముడు

విషాదంలో వచ్చే నవ్వులో ఎంత ఆనందం వుంది నిజమైన నవ్వులో లేని ఆనందం, అనుభూతి అందులో వుంది.

సైకిలు స్టాండ్ వేశాడు.

"అమ్మా ఎలా వుందే."

దీపం వెలిగించాడు.

"ఈ మాత్ర వేసుకో."

అమ్మ మాట్లాడలేదు.

"అమ్మా" అని పిల్చాడు. ఏడ్చాడు.

అమ్మ చచ్చిపోయింది.

నలుగురూ చేరి అమ్మను మంచం దింపారు

"అమ్మాయికి టెలిగ్రాం ఇవ్వరాదా."

సీతారాముడు ఏడుస్తున్నాడు. అతను ఏడుస్తున్నాడని ఎవరికీ తెలియదు.

"జబ్బేమిటో."

"ముసలితనం."

"ఆ మనిషిని చూస్తే అలా అన్పించడంలేదు. ఏదో కనపడని జబ్బుతో పీక్కుని చచ్చినట్లు కనబడుతోంది."

తల్లి శవాన్ని చూచాడు.

"మా అమ్మకు కేన్సరు. కనీసం మందులు ఇప్పించుకోలేని దౌర్భాగ్యుడ్ని, నేను చేసింది హత్య. ఈ నేరం పోలీసులకూ చట్టానికి అందదు. నన్నెవరూ శిక్షించలేరు."

వెర్రిగా నవ్వాడు సీతారాముడు.

"పాపం బిడ్డ తల్లిని ఎంత ప్రేమగా చూసుకునేవాడో."

"అంతా అబద్ధం.... అబద్ధం."

పసిపిల్లాడిలా ఏడుస్తున్నాడు.

"ఏడిస్తే మాత్రం మీ అమ్మ తిరిగొస్తుందా। జరగవలసింది చూడు."

రాత్రి ఎనిమిదిగంటల ముహూర్తం. సీత సంతోషంగా వుంటుంది. ఆ సంతోషాన్ని సీతకు దూరంచేయడం ఇష్టంలేదు. సీతను కట్టుకున్న నేరానికి, ఆమెకు మిగిల్చే కొద్ది ఆనందకరమైన క్షణాలు— ఇదే ఆమెకు క్షమాపణలు కావాలి.

"ఈ విషాదం సీతకు తెలియనివ్వను"

ఆ రాత్రి

తల్లి శవంముందు సీతారాముడు——

రేపు ఆదివారం—— జీతాలు రావు.

"అమ్మా నెలవురోజు చూచి చచ్చిపోయావు గానీ జీతాలు వచ్చేరోజు చూచి చావలేదు."

వెధవ ఆలోచన.

నెత్తి బాదుకున్నాడు.

చేతిలో నాలుగొందల అరవై, మిగిలేది ఎంత? పఠాన్‌కు నూటయాభై, కుబేరరావుకు రెండొందల పాతిక. మిగిలేది ఏమిటి.

పాలవాడు బజారున పడతాడు.

తిన్నది కక్కిందాకా తిడతాడు కిరాణావాడు.

ఇంటాయన సామాన్లు బైటపారేస్తాడు.

మిగిలిన నాలుగు వారాల బతుకేమిటి.

ఎలా బ్రతకాలి. ఏం తిని బ్రతకాలి.

తెల్లవారింది.

"పది గంటలకల్లా ఎత్తుబడి జరిగేటట్లు చూడు నాయనా। శవం వాసనొస్తోంది."

సైకిలు తీసుకున్నాడు. కదిలాడు.

వంద రూపాయలు కావాలి. ఎవరిస్తారు ఎందుకిస్తారు.

అప్పారావ్ ఆదివారం ఇంట్లో దొరకడు,

బార్ షాపులన్నీ గాలించాడు.

"జై పాతాళభైరవి."

"నరుడా ఏమి నీ కోరిక."

"మా అమ్మ శవాన్ని తగలెయ్యాలి. వంద రూపాయలు కావాలి."

"నరుడా! ఈరోజు ఆదివారం. బేంకులు సెలవు. నోట్లు నేను చేస్తే దొంగ నోట్లని పిస్సు పోలీసులు పట్టుకుంటారు, ఫరవాలేదనుకుంటే ఎన్ని బస్తాల నోట్లు కావాలన్నా ఇస్తాను."

"వొద్దు తల్లీ వొద్దు. నన్నిలా బ్రతకనివ్వు."

పాతాళభైరవి మాయమయింది.

మళ్ళీ విషాదంలో ఆనందం—ఎంత బావుంది.

సైకిల్ అమ్మిపారేస్తే—మంచి ఆలోచన.

సైకిలుషాపు మూసిఉంది. దాని యజమాని వాకిట్లో కూర్చుని ఆదివారం పేపరులో సినిమా బొమ్మలు చూస్తున్నాడు.

"బైర్లు ట్యూబులా?"

"సైకిలు అమ్ముతాను."

షాపువాడు నవ్వాడు.

ఎంత అలుసుగా వుంది తన బతుకో నవ్వులాటా. రోషం వచ్చింది.

"రేపు స్కూటర్ వస్తుంది. సైకిలెందుకని అమ్మేస్తున్నాను."

వాడు నమ్మినట్లు లేదు.

"ఎంతకిస్తారు."

"మీరే చెప్పండి."

సైకిలుషాపువాడు సైకిల్ చూచాడు పాతిక రూపాయల ఫీజు తీసుకున్న డాక్టరుకూడా అమ్మను ఆ రోజు అంతగా పరీక్ష చేయలేదు.

"ఓ యాభై ఇస్తాను."

యాభై రూపాయలా? ఎంత మంచి రేటు. ఇంకా పూరికే ఇవ్వమంటాడేమో అనుకున్నాడు. వెధవ సైకిలు అంతకంటే ఏం ఖరీదు చేస్తుంది. తూకానికి అమ్మినా పాతిక రూపాయలు రాదు. పాపం షాపువాడు నష్టపోతున్నాడు.

యాభై రూపాయలు చేతిలో వుంచాడు.

చివరిసారిగా సైకిలు చూసుకున్నాడు. పిచ్చిముండ ఎంత దిగులుగా చూస్తుందో. కష్టాలను సుఖాలను ఆ గదిలో వుండి చూచింది. అది చేసిన సేవకు ఎప్పుడూ ఆయిల్ కూడా వేయించలేదు. ప్రాణం వున్న తల్లికి వచ్చిన సేవ్వరునే ఏం చేయలేకపోయాడు. ఇక సైకిల్ను ఏం చేయగలడు.

మరికొద్దిసేపు అక్కడ నిలబడి సైకిల్ చూస్తుంటే—

"ఆ యాభై ఇలా ఇవ్వండి."

"ఎందుకు."

"అనవసరంగా ఎక్కువ ధరపెట్టి కొన్నాను. మీ సైకిల్ తీసుకపోండి."
అని అంటాడేమోనని భయపడి నడక సాగించాడు.

నలుగురైదుగురు తెలిసినవాళ్లు శవాన్ని చూస్తున్నారు.

"ఏరా సీతా, ఇంత ఆలశ్యం. నన్నెపుడు తగలెడతావురా."

"ఆ పని చేద్దామనే సైకిల్ అమ్మేశాను."

"సైకిల్ అమ్మేశావా!"

"ఎందుకమ్మా ఏడుస్తావు. పాత సైకిలేగా."

"ఆ,ఏసుకు తంత దూరం ఎలా నడిచిపోగలవురా!"

చిన్నప్పటి కథ మళ్ళీ గుర్తుకొచ్చింది.

"అమ్మా నిన్ను నేను చంపినా నా మీద ఎంత ప్రేమను చూపిస్తూ, నేను చేసిన పనిని గుర్తుకు తెస్తూ, నన్ను చిత్రహింసలు పెడుతున్నావ్ కదే"

"ఎత్తుబడికి యాభై చాలవు. కనీసం రెండొందలయినా కావాలి."

"రెండొందలా"

* * *

"నూటయాభయ్యా" కుబేరరావు అన్నాడు

సీతారాముడు ఇపుడు కుబేరరావు ఇంటిముందున్నాడు.

"నావల్ల కాదు."

"నీ కాళ్ళమీద పడతాను. కావాలంటే ఈ స్టీలు కారియర్ వుంచు."

"లేదంటే "

ఏడ్చాడు సీతారాముడు.

"రేపు నా జీతం అంతా నీవే తీసుకో. దమ్మిడీ నా కక్కర్లేదు."

కుబేరరావు ఆ మాటకు కదిలాడు.

ఇపుడు సీతారాముడు చొక్కాలో రెండొందలున్నాయి.

శ్మశానానికి శవం కదిలింది.

కుండ తీసుకుని ముందు నడుస్తున్నాడు. తూలుతూ నడుస్తున్నాడు.

తన సైకిలను సైకిలుషాపువాడు తొక్కుతున్నాడు.

"నాయనా సీతా! అదిగోరా నీ సైకిలు." తల్లి అరుస్తోంది.

అమ్మకు కేన్సరని చెప్పిన డాక్టరు డిస్పెన్సరీ ముందు నడుస్తున్నారు.

"నాయనా సీతా! ఈ డాక్టరు నా రోగం ప్రమాదం కాదని చెప్పి నన్ను మోసం చేశాడు. మీరెవరూ ఆ డాక్టరు దగ్గరకు వెళ్లొద్దు."

సీతారాముడు తల్లి శవాన్ని చూశాడు.

ఎవరు ... ఎవరు.... తనతో మాట్లాడుతోంది.

"ఏమిటి నాయనా వెనక చూపులు చూస్తున్నావు. ఎదురురాయి తగిలితే పడిపోతావు. నీ చేతిలో నిప్పులకుండ వుంది. కుండ పగిలి నిప్పులు వొంటిమీద పడతాయి. నేను వస్తున్నానులే. నెమ్మదిగా నడు."

సీతారాముడిలో దుఃఖం ఆగలేదు.

చితికి నిప్పంటించాడు

అమ్మ కాలిపోతోంది.

* * *

ఆ గదిలో.... చీకట్లో....

సీతారాముడు ఏడుస్తున్నాడు.

బ్రతుక్కి అర్థం. అవసరం కనిపించడంలేదు. సంపాదించే జీతం తనది కాదు. వడ్డీలు చెల్లించను బ్రతకాలి. ఉద్యోగం చేయాలి.

నాలుగు వారాల బ్రతుకులో రకరకాల విషాదాలను చవిచూసి విసిగి పోయిన మనిషికి పరిష్కారం ఏమిటి.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతారు. వాళ్ల పెళ్లిళ్లు చేయగలడా!

పెరిగేదాకా కనీసం కడుపునిండా తిండి పెట్టగలడా! తనే చచ్చిపోతే....

ఆ నెలలో చేసిన అప్పులు సీతను చుట్టుకుంటాయి. పాలవాడు, కిరాణా వాడు, వడ్డీవాళ్లు పీక్కుతింటారు.

గుమాస్తా బతుకు ఈజ్ ఈక్వల్ టూ ఒక నెల బతకడానికి చేసిన అప్పు.

గుమాస్తా అస్తి ఈజ్ ఈక్వల్ టూ ఒక నెల బతకడానికి చేసిన అప్పు.

తను చస్తే పదివేలు సీతకు ఇస్తారు. పి.యఫ్‌లో తీసుకున్న లోన్లు పోను మూడు నాలుగు వేలు వస్తాయి సీతకు ఫించను ఇస్తారు.

అబ్బో ఎంత డబ్బు.

అప్పుడయినా సీత నిర్విచారంగా బ్రతుకుతుంది. వచ్చిన డబ్బును వడ్డీకి యిచ్చుకుని బ్రతుకుతుంది

మగవాడిలో లేని సహనం, ఓర్పు ఆడదానిలో వుంటాయి. సమస్యలకు దూరంగా పారిపోతాడు మొగాడు సమస్యలకు సమీపంగాన చిఎదుర్కొంటుంది స్త్రీ.

సీతమీద ఆ నమ్మకం వుంది.

ఇక తన బతుకెందుకు.

చావడం మంచిది.

చావు ఎంత చక్కటి పరిష్కారం.

గ్లాసులో మంచినీళ్లు అందుకున్నాడు. కడుపునిండా తాగాడు.

గ్లాసుమీద అక్షరాలు .

"సీతారాముడు- సీత వివాహ శుభ "

చివరిసారిగా వేళ్లుపెట్టి ఆ అక్షరాలు తడుముకున్నాడు చీకట్లో.

అమ్మ ఖాళీ మంచం—

"జాగ్రత్త నాయనా చీకట్లో వెళ్తున్నావ్."

ఏసవను శక్తిలేని సీతారాముడు కదిలాడు.

* * *

టైం ఎంతయిందో—

మెయిల్ ఇంకా రాలేదు.

రైలు పట్టాలమీద పడుకున్న సీతారాముడు విసుక్కున్నాడు.

"పోయినోళ్లందరూ మంచోళ్లు ." ఈ పాట ఎందులోఁది. మూగ మనసులు సినిమాలో వుంది. సాయంత్రం సినిమా పోస్టరును చూచాడు. ఎప్పటి సినిమా. ?

తను చచ్చిపోగానే సీత ఏడుస్తుంది.

పాపం పిచ్చిది.

"జై పాతాళ భైరవి."

"నరుడా ఏమి నీ కోరిక"

"మెయిల్ ఎప్పుడొస్తుంది"

"అది మాత్రం నా శక్తికి మించిన పని. వస్తుందో రాదో చెప్పలేను."

ఏమిటీ పిచ్చి ఆలోచనలు.

"ఎవరు బాబూ సీకట్లో."

ఆ మాటలు వినిపించినవైపు చూశాడు.

"నా టాడకేం"

"ఎవరైతే నీకేం"

"బండ్లు వొస్తాయ్. పట్టాల మీద పడుకున్నారేం."

"నా ఇష్టం. పడుకుంటాను."
"సచ్చిపోవాలనా."
"అవును."
"ఎంత అమాయకులు బాబూ! మీరు పడుకున్న లైనుమీదకు ఏ బండీ రాదు. ఇపుడొచ్చే బండ్లన్నీ అదిగో ఆ లైను మీదనే."
పక్కనున్న లైను చూశాడు.
సీతారాముడు లేచి పక్కనవున్న పట్టాలమీదకు వెళ్లాడు. పట్టాల మీద పడుకున్నాడు.
మనిషిలో జాలి పూర్తిగా చచ్చిపోయింది. తను చస్తున్న విషయం తెలిసికూడా ఆపకుండా చావను సలహా ఇస్తున్నాడు. తన చావు ఎవరికీ జాలి కలిగించదా!
బిచ్చగాడు బీడీ వెలిగించాడు.
"సావబోయే ముందు సిల్లరేదన్నా వుంటే ధర్మం వేయండి. పున్నెం వస్తుంది."
"ఎగతాళిగా వుందా!"
సీతారాముడు అరిచాడు.
"ఎందుకు బాబూ సచ్చిపోతున్నారు."
"బతకడం చేతగాక."
"ఉద్యోగం సేత్తున్నారా."
"ఏదో ఏడుస్తున్నాను."
"పెళ్ళాం పిల్లలున్నారా!"
"వివరాలు అడుగుతున్నావు పోషిస్తావా!"
"అవసరమయితే తప్పుతాదా"
"నీకు సంసారం లేదా."
"ఉంది. నా పెళ్ళాం ఐదుగురు పిల్లలు."
"అడుక్కుతినేవాళ్ళందర్నీ పోషిస్తున్నావా!"
"కన్నందుకు తప్పుతాదా!"
"అప్పులేవా!"
"మడిసి పుట్టడమే ఓరో మడిసికి అప్పుండి పుడతాడు."
"వెధవ చచ్చు వేదాంతం. నీకు సమస్య లేముంటాయి. నలుగురూ

నాలుగు వూళ్ళమీదపడి అడుక్కుంటారు. తింటారు. ఏ చెట్టుక్రిందో కాళ్ళు ముడుచుకుంటారు."

బిచ్చగాడు నవ్వాడు

"ఎంత సెట్టుకు అంత గాలి బాబూ! బతుకులో ఇసిగిపోయినట్టున్నావ్. సావనొచ్చావు. సావులేని మడిసి, కష్టాల్లేని మడిసి బూపెపంచికంలో వోరు లేరు. సచ్చి నీవు సుఖపడతావ్. నీ పెళ్లాంబిడ్డల బతుకు ఆలోసించినావా! నాలుగు దినాలు ఏడుస్తారు. సంపాదించే మొగాడు సచ్చాడని నీతోపాటు సావరు. ఆళ్ళెందుకు సావరో ఆలోసించినావా! బతుకంటే ఆశ కాబట్టి, బతుకంటే ఇసిగిన వోళ్ళంతా సావాలంటే రైలుపట్టాలు— సంద్రాలు— నదులు— బావులు— ఇసాలు ఏవీ సాలవు బాబు. మడిసిని బతికించేది సుకమూ డబ్బూ కాదు బాబు. ఆశ వొక్కటే బతికిస్తాది. కష్టాలు మడిసికి గాక మానుల కొస్తాయా."

బిచ్చగాడి బీడీ ఆరిపోయింది

వెధవ వేదాంతం, అనుభవిస్తేగాని వాడికి తెలియదు.

"బాబూ ఈ పుస్తకం సూడు."

అగ్గిపుల్ల వెలిగించాడు బిచ్చగాడు.

"రెండో తరగతి సోషల్ పుస్తకం."

సీతారాముడు తటక్కున లేచి కూర్చున్నాడు.

"మా పెద్దోడు— రెండో కళాసు. సోసలు పుస్తకం వుదయమే పట్రమ్మన్నాడు."

బిచ్చగాడు వుమ్మేశాడు.

అది తనమీద పడినట్లుంది

తనకు చేతకాని బ్రతుకును— బిచ్చగాడు ఎంత హాయిగా అనుభవిస్తున్నాడు.

"బాబూ సెప్పడం మరిశాను."

"ఏమిటి."

"ఈరోజు మెయిల్ బండి రాదు."

"ఏం?"

"కావలి కాడ పట్టాలు తప్పినాదట."

సీతారాముడి రక్తం గడ్డకట్టుకపోయింది,

సీత ఆ బండికే వస్తున్నట్లు ఉత్తరం రాసింది.

"విజయంగానా"

"ఇప్పుడు నేను జేషనుకాడ ఆ యవ్వారం తెలుసుకునే వస్తున్నాను."

సీతకేమయిందో.... పిల్లలు ఏమైనారో....

పట్టాలవెంట పరుగుతీస్తున్నాడు.

"బాబూ! సావకుండా వెళ్ళిపోతున్నారేం... ఈ లైను మీదికి తమిళనాడు వస్తాది.... సత్తే ఆ బండికిందే సావాలి."

"నోర్మూయ్ వెధవ."

సీతారాముడు పరుగు ఆగలేదు.

"సీతకు పిల్లలకు ఏ ప్రమాదం జరగకుండా చూడు భగవాన్." దేవుడికి వినబడే విధంగా అరిచాడు.

రేపు జీతాలొస్తాయి. ఆర్నెల్ల ఇంక్రిమెంటు వస్తుంది

పెద్దదానికి సోషల్ పుస్తకం కొనాలి. సీతకు చీర తీసుకోవాలి.

పండుగ అడ్వాన్సు తీసుకుని వడ్డీలనే పీడా వదిలించాలి. ఆఫీసులేని సమయంలో ప్రయివేట్లు చెప్పయినా కొత్త సైకిల్ కొనాలి

అన్నింటికన్నా రేపు... సాయంత్రం... సీతతో పిల్లలతో మూగమనసులు సినిమా....

సీత సీత.... సీత కెలావుందో ..

తన చావును గురించి వ్రాసిన కాగితం ముక్కలు ముక్కలు చేశాడు.

"జై పాతాళభైరవి,"

"నరుడా ఏమి నీ కోరిక" అని "ప్రతిసారి నేనే అడుగుతున్నాను. ఈ సారి- నీవేం అడక్కు. చెప్పు నరుడా! ధనవంతులా! బాంక్ బాలన్సులా! ఉద్యోగంలో ప్రమోషనా! అంబాసిడర్ కారా! కేన్సరు ఎప్పుడొచ్చినా ఉచితంగా వైద్యం చేయించే నదుపాయమా! వడ్డీ లేకుండా తిరిగి అడుగని అప్పునొరికే అవకాశమా!"

ఒక్క క్షణం ఆలోచించాడు సీతారాముడు

"నా సీతకు... నా పిల్లలకు ఏమయిందో చెప్పు తల్లీ"

"అది నా వల్లకాదు రైలు ప్రమాదంలో చావుల గురించి—"

పాతాళభైరవి మాయమైంది....

సీతా అ అూ సీతారాముడు పరుగు తీస్తున్నాడు.

జీవితంలో మరో నెల మొదటి వారం పోస్టరును అతికించుకుంది.

---